తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## జగనన్న క్రీడా సంబరాల లోగో ఆవిష్కరణ



చిత్తూరు, నవంబర్ 17 ప్రభాతవార్త: జిల్లా పరిషత్ ఛైర్మన్ ఛాంబర్‌లో గురువారం జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు జగనన్న క్రీడా సంబరాలు లోగోను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా జగనన్న క్రీడా సంబరాలు పేరుతో ఆటల పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఆటల పోటీల్లో కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్, క్రికెట్ తదితర పోటీలను మొదట నియోజకవర్గ స్థాయిలో నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆపై జిల్లా, జోనల్ స్థాయిల్లో క్రీడలు జరుగుతాయన్నారు. రాష్ట్ర స్థాయిలో ఈ క్రీడా పోటీలు డిసెంబర్ 20. 21వ తేదీల్లో జరుగుతాయన్నారు. ఈ క్రీడల్లో విజేతులైన క్రీడాకారులకు 50 లక్షల రూపాయల బహుమతులు అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్పోర్ట్స్ ఆథారిటీ చీఫ్ కోచ్ బాలాజీ, బాస్కెట్‌బాల్ కోచ్ బి.ఉదయకుమార్, రెస్లింగ్ కోచ్ ఎండి రఫీ, టెన్నిస్ కోచ్ ఎన్.శశిధర్ తదితరులు పాల్గొన్నారు.

## శివయ్య సేవలో ప్రభుత్వ చీఫ్ విప్

శ్రీకాళహస్తి, నవంబర్ 17 ప్రభాతవార్త



రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్, ఎంఎల్‌సి ఉమారెడ్డి వెంకటేశ్వర్లు గురువారం కుటుంబసభ్యులతో స్వామి అమ్మవార్ల సేవలో పాల్గొన్నారు. వారికి దక్షిణ గోపురం వద్ద ఆలయ మర్యాదలతో ధర్మకర్తల మండలి ఛైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు స్వాగతం ఏర్పాటు చేసారు. సహస్రలింగేశ్వరుని ఆలయం వద్ద రాహుకేతుదోష నివారణ పూజలను జరిపించుకున్నారు. వేదపండితులు వేద మంత్రాలతో పూజలు జరుపుకున్న వారికి స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం చేసుకున్నారు. ఛైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు స్వామి అమ్మవార్ల చిత్రపటాలను, తీర్థ ప్రసాదాలను అందించారు. ఏర్పాట్లను పాలకమండలి సభ్యులు పి.మల్లికార్జున్‌రెడ్డి, ఆలయ ఇన్స్పెక్టర్ శ్రీనివాసులు రాజు సిబ్బంది పర్యవేక్షించారు.

## శ్రీహరికోటలో
# ప్రైవేటు రాకెట్ ప్రయోగ సందడి

- ఇస్రోతో పాటు పలు సంస్థల ప్రముఖుల రాక
- ఇది చిన్న ప్రయోగమైనా పెద్ద ప్రయోజనాలు
- భవిష్యత్‌లో విద్యార్థులకు అంతరిక్ష విజ్ఞానమే చదువు




శ్రీహరికోట (తడ), నవంబర్ 17 ప్రభాతవార్త

శ్రీహరికోట నుంచి శుక్రవారం తొలి ప్రైవేటు రాకెట్ ప్రయోగం జరగనుంది. స్కైరూట్ సంస్థ వారు విక్రమ్-ఎస్ పేరుతో రాకెట్‌ను స్వయంగా నిర్మించి భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ శ్రీహరికోట నుంచి ప్రయోగిస్తున్నారు. ఇది ప్రైవేటు వారి తొలి ప్రయోగం కావడంతో ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే ఎంతమంది ప్రైవేటు వారు రాకెట్లు తయారు చేసినా ప్రస్తుతం మన శ్రీహరికోట నుంచే ప్రయోగించక తప్పదు. ఇక్కడ సౌండింగ్ రాకెట్ కాంప్లెక్స్‌తో పాటు మొదటి, రెండవ ప్రయోగ వేదికలు ఉన్న కారణంగా మూడు చోట్ల నుంచి ఇటు ఇస్రో తయారు చేసే రాకెట్లను, అటు ప్రైవేటు వారు తయారు చేసే రాకెట్లను ప్రయోగించుకునే అవకాశం ఉంది. రాకెట్ల తయారీలో ఇస్రో వేగం పెంచగా, ప్రైవేటు వారు కూడా అంతే వేగంతో ఇబ్బడిముబ్బడిగా రాకెట్లు తయారు చేసే రోజులు ముందున్నాయి. తొలి రాకెట్ ప్రయోగం విజయవంతం కావాలని ప్రతి ఒక్కరు ఆసక్తిగా ఎదురు చూస్తుండగా, ఒక వైపు స్కై రూట్ ప్రతినిధులు, మరోవైపు ఇస్రో శాస్త్రవేత్తలు, ఇంకో వైపు ఇన్‌స్పేస్ అధికారులు షార్‌లోనే ఉండి ప్రయోగం ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. కేంద్రమంత్రి జితేంద్రసింగ్‌తో పాటు మరికొందరు ప్రముఖులు కూడా షార్‌లో ఉండి రాకెట్ ప్రయోగాన్ని నేరుగా తిలకించే అవకాశముంది. సాధారణ రాకెట్ల ప్రయోగాలలాగానే శ్రీహరికోటలో సీఐఎస్ఎఫ్ దళాలు, పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. ప్రస్తుతానికి ఉదయం 11.30 గంటలకు ఈ రాకెట్ ప్రయోగ సమయంగా చెప్తున్నారు. చివరి క్షణాల్లో కొంచెం మార్పు చేర్పులు కూడా ఉండొచ్చని షార్ వర్గాలు అంటున్నాయి. గురువారం మధ్యాహ్నం నుంచి వాతావరణం పూర్తిగా అనుకూలంగా ఉన్న కారణంగా శుక్రవారం రాకెట్ ప్రయోగానికి ఎటువంటి ఇబ్బంది ఉండదని నమ్ముతున్నారు.

**తొలి ప్రైవేట్ రాకెట్ వివరాలు ఇలా ..**

రాకెట్ తయారు చేసిన సంస్థ స్కై రూట్ ఏరోరూట్ ఏరోస్పేస్, బరువు 545 కిలోలు, ఎత్తు 6 మీటర్లు, వ్యాసం 375 సెంటీ మీటర్లు, రాకెట్ ప్రయాణ సమయం 300 సెక్షన్లు, రాకెట్ ఎగిరే దూరం 100 కి.మీ వేగం, ధ్వని వేగం కన్నా 5 రెట్లు ఎక్కువ మోసుకు వెళ్ళే పేలోడ్లు 3

## అమ్మవారి బ్రహ్మోత్సవాలకు
# సర్వం సిద్ధం



విద్యుత్ దీప కాంతులతో అమ్మవారి ఆలయం



తిరుచానూరు, నవంబర్ 17 ప్రభాతవార్త: కలియుగ ప్రత్యక్షదైవం తిరుమల శ్రీ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల తరహాలోనే తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి వార్షిక కార్తీక బ్రహ్మోత్సవాలు అంగరంగవైభవంగా నిర్వహించేందుకు టిటిడి సర్వం సిద్ధం చేస్తోంది. గత మూడేళ్లుగా అమ్మవారి బ్రహ్మోత్సవాలు కరోనా నేపథ్యంలో ఏకాంతంగా నిర్వహించిన విషయం యం విధితమే. ప్రస్తుతం కరోనా పూర్తిగా నియంత్రణ అయిన కారణంగా ఏ ఏడాది అత్యంత వైభవంగా నిర్వహించాలని టిటిడి నిర్ణయించింది. 20న ఉదయం ధ్వజారోహణంతో ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయంతో పాటు పరిసర ప్రాంతాలు, పద్మ సరోవరం, తిరుమాడవీధులు రంగులు వేసి, విద్యుత్ దీపాలు, దేవతామూర్తుల ప్రతిరూపాలు, తిరుపతి-తిరుచానూరు మధ్య స్వాగత ఆర్చిలు, ఘంటసాల విగ్రహం వద్ద నుండి ప్రత్యేకంగా భారీ షెడ్లు ఏర్పాటు చేస్తున్నారు. 28న ఉదయం అత్యంత పవిత్రమైన, విశిష్టమైన పుష్కరిణిలో పంచమితీర్థానికి ఇతర రాష్ట్రాల నుండి, అలాగే పరిసర ప్రాంతాల ప్రజలు అధిక సంఖ్యలో భారీగా తరలివస్తారు. అందుకు అనుగుణంగా క్యూలైన్లు, అన్నప్రసాదాలు, తదితర ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. 9 రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలలో ఉదయం 8 నుండి 10 గంటల వరకు, రాత్రి 7 నుండి 9 గంటల వరకు వహనసేవలు జరగనున్నాయి. మునుపెన్నడూ లేని విధంగా బ్రహ్మోత్సవాలు అలవైకుంఠాన్ని తలపిస్తున్నాయి.

# బాబు పాలనలో ఉన్నదే కౌరవసభ

## - మంత్రి రోజా



కేక్ కట్ చేసి మంత్రి రోజాకు తినిపిస్తున్న దృశ్యం

పుత్తూరురూరల్, నవంబరు 17 ప్రభాతవార్త: జగనన్న నేతృత్వంలో ప్రస్తుతం ఉన్న ప్రభుత్వం రానున్న ఎన్నికల్లో 175 స్థానాలకు తగ్గేదేలేదని మంత్రి రోజా అన్నారు. గురువారం తన పుట్టిన రోజు సందర్భంగా నగరి, పుత్తూరు మార్గ మధ్యంలోని జీవీఆర్ కన్వెన్షన్ హాలులో ఏర్పాటు చేసిన సమావేశంలో కేక్ కట్‌చేసి అనంతరం ఆమె మాట్లాడారు. మేనిఫెస్టోను భగవద్గీతలా భావించి ఇచ్చిన ప్రతి హామీని జగనన్న నెరవేరుస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో పార్టీ 175 స్థానాలు సాధించడం ఖాయమన్నారు. ఎన్నికలు సమీపిస్తున్నందున టిడిపి నాయకుడు తనకు ఇదే చివరి ఎన్నికలు తనకు ఒక అవకాశం ఇవ్వండని బీదేడుపులేడు స్తాన్నాడన్నారు. ప్రస్తుతం ఉన్నది కౌరవ సభని, తానొస్తే పెద్దల సభగా మారుస్తానంటున్నాడన్నారు. ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి పార్టీ లాక్కొని ఆయనకు మైక్ ఇవ్వని నాయకులున్నది కౌరవ సభని మహిళ అని చూడకుండా తనను అసెంబ్లీ రూల్స్‌కు విరుద్ధంగా ఏడాది పాటు సస్పెండ్ చేసిన సభ కౌరవ సభ అవుతుందన్నారు. ఇంకో పార్టీ ఉందని ఆ పార్టీ కార్యకర్తలను చూస్తే జాలేస్తుందన్నారు. ఆ పార్టీ కార్యకర్తలకు ఏ రోజు ఏ జెండా మోయాలో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. ఈ సందర్భంగా జబర్దస్త్ టీం సభ్యులు నవ్వుల వర్షం కురిపించారు. సభావేదిక వద్ద ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు మంత్ర ముగ్దుల్ని చేసి కుర్చీలకు బంధించింది. కరగాట్టం, భరత నాట్యాలు, శరీరం గగుర్పొడిచేలా చేపట్టిన నృత్యాలు, మంగ్ల ఇంద్రావతి పాడిన పాటలు, జబర్దస్త్ నటులు రాఘవ, రాకేష్, వర్ష వంటి వారు చేసి హాస్యాలు కనువిందు చేసాయి. కార్యక్రమంలో జడ్పీ ఛైర్‌పర్సన్ శ్రీనివాసులు, నగరి, పుత్తూరు మున్సిపల్ ఛైర్మన్‌లు నీలమేఘం, హరి, ఎంపీపీ భార్గవి, రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రారెడ్డి, మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి, నాయకులు ప్రత్యూష, బీడీ భాస్కర్, గోవిందయ్య, పర్యాటక శాఖ, సాంస్కృతిక శాఖ, క్రీడాశాఖ ఈడీలు, డీవీఎంలు, మున్సిపల్ వైస్ ఛైర్మన్‌లు, మండల వైస్ ఎంపీపీలు, కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, కో-ఆప్షన్ సభ్యులు, వీవర్స్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు శుభాలు కలగాలని వేడుకున్నా : రోజా



తిరుమల/తిరుపతి, నవంబర్ 17ప్రభాతవార్తప్రతినిధి: కలియుగప్రత్యక్షదైవమ్ ఏడుకొండల వేంకటేశ్వరస్వామి కరుణాకటాక్షాలు, తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ ఆశీస్సులతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు, రాష్ట్రప్రజలకు శుభాలు కలగాలని, ప్రజలకు ఆశీస్సులు ఉండాలని తిరుమల వెంకన్నను, గంగమ్మ తల్లిని ప్రార్థించినట్లు రాష్ట్ర మంత్రి ఆర్‌కె రోజా చెప్పారు. ప్రజలకు మరిన్ని సేవలందించే దిశగా తనవంతు కృషి చేయడానికి శక్తిని ప్రసాదించాలని వేడుకున్నానన్నారు. తన కుమార్తె, కుమారుడు సినిమాల్లోకి రావాలంటే తల్లిగా, నటిగా సంతోషిస్తానని అన్నారు. మంత్రి ఆర్‌కె రోజా తన పుట్టినరోజు సందర్భంగా కుటుంబసభ్యులతో కలసి గురువారం ఉదయం తిరుమలకు చేరుకుని వెంకన్న ఆశీస్సులతోబాటు తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ ఆశీస్సులందుకున్నారు. గంగమ్మ ఆలయం వద్ద తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి, నగర మేయర్ డాక్టర్ ఆర్.శిరీషా, ఆలయ ఛైర్మన్ కట్టా గోపీయాదవ్, ఆలయ ఇఓ ఎం.మునికృష్ణయ్య అర్చకులు స్వాగతం పలికి అమ్మవారి దర్శనం చేయించారు.

## ప్రభుత్వ భవన నిర్మాణాలు
# వేగవంతంగా పూర్తి

- వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ కోన శశిధర్



చిత్తూరు, నవంబర్ 17 ప్రభాతవార్త: గ్రామాల్లో ప్రభుత్వ సేవలను ప్రజలకు క్షేత్ర స్థాయిలో అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రభుత్వ భవన నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ కమీషనర్ కోన శశిధర్ అన్నారు. అమరావతి నుండి గురువారం రాష్ట్ర పంచాయతీరాజ్ కమీషనర్ కోన శశిధర్ జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డి, పంచాయతీరాజ్ ఎస్ఇ చంద్రశేఖర్‌రెడ్డి, డ్వామా పిడి చంద్రశేఖర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో కమీషనర్ కోన శశిధర్ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకు భూహక్కులు కల్పించడానికి సామిత్ర సర్వే జరుగుతుందని ఈ సర్వేను వేగవంతం చేయాలన్నారు. అలాగే శానిటరీ కాంప్లెక్స్‌ల నిర్మాణాలను నిర్ణీత కాల వ్యవధిలో పూర్తి చేయడానికి చర్యలు చేపట్టాలన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డి, డ్వామా పిడి చంద్రశేఖర్‌లు మాట్లాడుతూ జిల్లాలో 697 గ్రామ పంచాయతీలు వుండగా 580 గ్రామ పంచాయతీలకు సంపద కేంద్రాలు వున్నాయని, మరో 117 సంపద కేంద్రాలు అవసరం కాగా ఇందులో 95 కేంద్రాలను ఇప్పటికే మంజూరు చేయడం జరిగిందని కమీషనర్‌కు వివరించారు. అలాగే స్వామిత్ర సర్వేకు సంబంధించి 101 గ్రామాలకు మ్యాపులు రావడం జరిగిందని, 21 గ్రామాలకు గ్రౌండ్ ట్రూథింక్ పూర్తి అయ్యిందని మరో రెండు గ్రామాలకు సంబంధించి 13 నోటిఫికేషన్ విడుదల చేయడం జరిగిందని జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీ కమీషనర్‌కు వివరించారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ నాగజ్యోతి మాట్లాడుతూ జిల్లాలో 488 కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌ల నిర్మాణాలు చేపట్టాల్సి వుండగా 236 కాంప్లెక్స్‌ల నిర్మాణాలు పూర్తి చేయడం జరిగిందని కమీషనర్‌కు వివరించారు. మిగిలిన శానిటరీ కాంప్లెక్స్‌ల నిర్మాణాలు కొనసాగుతున్నాయని ఆమె పేర్కొన్నారు.



గురువారం అయ్యప్ప భక్తులతో కిటకిటలాడుతున్న కాణిపాకం ఆలయం

### ఉష్ణోగ్రతలు
17/11/2022



- తిరుపతి 29 డిగ్రీలు
- చిత్తూరు 31 డిగ్రీలు
- మదనపల్లి 24 డిగ్రీలు
- శ్రీకాళహస్తి 30 డిగ్రీలు
- వెంకటగిరి 30 డిగ్రీలు
- గూడూరు 31డిగ్రీలు

### బంగారం ధరలు
17/11/2022



22 క్యారెట్స్ 1గ్రాము రూ. 4,950

24క్యారెట్స్ 1గ్రాము రూ.5,400

### కోడిగ్రుడ్ల ధరలు
17/11/2022



కోడిగ్రుడ్డు :రూ.6.00

1 డజను: రూ.72.00

# ప్రతి కార్యాలయంలో సమాచారం బోర్డులు తప్పనిసరి

## ప్రభుత్వ అధికారులు జవాబుదారీతనంతో వ్యవహరించాలి
## - సమాచార కమీషనర్ హరిప్రసాద్‌రెడ్డి

తిరుపతిరూరల్, నవంబర్ 17 ప్రభాతవార్త: ప్రతి ప్రభుత్వ కార్యాలయం ముందు సమాచార బోర్డులు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ ఉద్యోగులు జవాబుదారీతనంగా వ్యవహరించాలని రాష్ట్ర సమాచార కమీషనర్ ఉల్చాల హరిప్రసాద్‌రెడ్డి సూచించారు. సమాచార హక్కు చట్టం-2005పై అవగాహన కలిగి పట్టణ ప్రాంతాలతో పాటు గ్రామీణ ప్రాంతాల నుండి సమాచార నిమిత్తం అర్జీలు పెరుగుతున్నాయని, ప్రజా ప్రయోజనాల దృష్ట్యా అధికారులు జవాబుదారీతనంగా వ్యవహరించి, అర్జీదారులకు నిర్ణీత సమయంలో అర్థవంతంగా సమాచారం అందించాలన్నారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లో ఆర్టీఐ దరఖాస్తులకు సంబంధించి కమీషనర్ కార్యాలయానికి అందిన వినతులపై సంబంధిత శాఖల అధికారులతో, అర్జీదారులతో క్యాంప్ కోర్టు నిర్వహించి, రెండురోజుల పాటు పరిష్కరించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. రాష్ట్ర సమాచార కమీషనర్ పి.ఐ.ఓలు, అఫిలేట్ అథారిటీలను ఉద్దేశించి ప్రసంగిస్తూ సమాచార హక్కు చట్టంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. అధికారులు కార్యాలయాల్లో




భద్రపరిచే ఫైల్స్‌ను ఇండెక్స్ ప్రకారం సిద్ధంగా ఉంచుకోవడం, ఆర్.టి.ఐ సెక్షన్-4 మేరకు వెబ్‌సైట్‌లలో సమాచారాన్ని ఎప్పటికప్పుడు అప్డేట్ చేయడం, చేయగలిగితే అర్జీదారునకు కోరిన సమాచారాన్ని త్వరగా అందించటానికి వీలుంటుందన్నారు. ప్రతి కార్యాలయం ముందు సమాచార బోర్డులు ఏర్పాటు కావాలని, అందులో సూచించిన ఎ.పి.ఐ.ఓ. పి.ఐ.ఓ అఫిలేట్ అథారిటీ పేర్లు, ఫోన్ నెంబర్స్, ఇ-మెయిల్ అడ్రస్ వంటివి అందుబాటులో ఉండాలన్నారు. అధికంగా రెవెన్యూశాఖలకు సంబంధించి ధరఖాస్తులు వస్తున్నాయని, రికార్డులే అందుబాటులో లేకపోవడంతో ఆలస్యం జరుగుతుందని, ప్రభుత్వం చేపట్టేన రీ- సర్వే పూర్తయితే ఇలాంటి ధరఖాస్తులు తగ్గుతాయన్నారు. ప్రతి ఏటా కమీషనర్ కార్యాలయానికి సెక్షన్-19 (3) మేరకు సుమారు 4వేల5వందల వరకు అందుతున్నాయన్నారు. అనంతరం క్యాంప్ కోర్టును ప్రారంభించి, సంబంధిత శాఖల అధికారులతో అర్జీదారులకు పరిష్కారం చూపారు. అంతకుమునుపు రాష్ట్ర సమాచార కమీషనర్ హరిప్రసాద్‌రెడ్డికి జె.సి. డికె బాలాజీ, డిఆర్వో శ్రీనివాసరావు స్వాగతం పలకగా జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి, ఎస్పీ పరమేశ్వరరెడ్డి మర్యాదపూర్వకంగా కలిసారు.

## తాతయ్యగుంట గంగమ్మకు
# అధునాతన నూతన ఆలయం!

-ఆలయ అభివృద్ధికి ప్రణాళికలు



తిరుపతి, నవంబర్ 17ప్రభాతవార్త: ప్రముఖ పుణ్యక్షేత్రం తిరుపతి నగరం అంతర్జాతీయ స్థాయిలో మరింతగా ఇనుమడింపవుతున్న తరుణంలో తిరుపతి గ్రామదేవతగా పూజలందుకుంటున్న తాతయ్యగుంట గంగమ్మ ఆలయాన్ని మరింతగా విస్తరించి, అధునాతనంగా నిర్మించేందుకు ప్రణాళికలు సిద్దమవుతున్నాయి. ఇందులో భాగంగా ప్రస్తుత ఆలయం స్థానంలో నూతన ఆలయం నిర్మాణానికి సాధ్యాసాధ్యాలు, నిధులు, ప్రభుత్వం, టిటిడి, దేవాదాయశాఖ సహకారంతోబాటు దాతల నుంచి సహాయసహకారాలు తీసుకునే దిశగా కార్యాచరణ రూపొందించనున్నారు. ఆలయం స్థానంలో నూతన ఆలయం నిర్మాణానికి ముందు అమ్మవారిని బాలాలయం ఏర్పాటుచేసి, అందులో అమ్మవారి విగ్రహప్రతిష్టాపన, కుంభాలకు శక్తి తదితర అంశాలు పూర్తిగా ఆగమశాస్త్రాలకు లోబడి చేపట్టాలని యోచిస్తున్నారు. తిరుపతి నగరంలో కొన్ని వందల సంవత్సరాల క్రిందట అప్పటి పరిస్థితులకు అనుగుణంగా గంగమ్మ ఆలయాన్ని నిర్మించారు. తిరుపతి నగరం విస్తరించడంతోబాటు అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలకు ధీటుగా పలు సంస్థలు, విశ్వవిద్యాలయాలు, తిరుపతి జిల్లాగా ఏర్పాటుకావడం వంటివి కలసొచ్చాయి. ఈ సమయంలో గంగమ్మ ఆలయానికి మహాప్రాకారం నిర్మాణానికి కూడా తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి చొరవ, ప్రోత్సాహం ఉంది. మహాప్రాకారాన్ని పూర్తిగా దాతల విరాళాలతో కృష్ణశిల గ్రానైట్‌తో నిర్మాణం చేపడుతున్నారు. ఎంతో అందంగా ముస్తాబవుతోంది. మహాప్రాకారం మరింత శోభను చేకూర్చునుంది. ఆలయంలో పలు మార్పులు, భక్తులకు సాఫీగా అమ్మవారి దర్శనం చేయించడం, ప్రసాదాలు అందించడం వంటివి ఇఓ మునికృష్ణయ్య అమలుచేస్తున్నారు. ఆలయ అభివృద్ధికి, నూతన ఆలయ నిర్మాణానికి అవసరమైన అంశాలపై గురువారం ఆలయం ప్రాంగణంలో తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి, నగరపాలక మేయర్ డాక్టర్ ఆర్.శిరీష, టిటిడి సిఇ నాగేశ్వరరావు, టిటిడి ఇంజనీరింగ్ సలహామండలి నిపుణులు ,మాజీ సిఇ రామచంద్రారెడ్డి, గంగమ్మ ఆలయ ఛైర్మన్ కట్టా గోపీయాదవ్, ఇఓ ఎం.మునికృష్ణయ్య, పర్యాటకశాఖ, దేవాదాయశాఖ అధికారులు, ప్రతినిధులుతో కలసి సంయుక్తంగా సుదీర్ఘంగా సమీక్షించారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## అన్ని వర్గాల సంక్షేమమే సిఎం వైఎస్ జగన్ ధ్యేయం

- ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

చిత్తూరు, నవంబర్ 17 ప్రభాతవార్త: రాష్ట్రంలో అన్ని వర్గాల సంక్షేమం కోసం సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పేర్కొన్నారు. చిత్తూరు రూరల్ మండలం అనంతాపురం, కుర్చివేడు పంచాయతీల పరిధిలో గురువారం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ గత మూడున్నర సంవత్సరాలుగా ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను



అర్హులైన లబ్ధిదారులకు అందజేసిందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ఇంటింటికి వెళ్ళి సంక్షేమ పథకాలు పొందిన వారిని కలుసుకొని అర్హులైన ఎవరికైనా పథకాలు అందకుంటే వాటిని మళ్ళీ దరఖాస్తు చేయించిఅందేలాఅధికారులుచర్యలుతీసుకొంటారన్నారు. కార్యక్రమంలో మండల వైకాపా అధ్యక్షుడు, బిఎన్ఆర్ పేట సర్పంచ్ త్యాగరాజు, జడ్పీటిసీ బాబునాయుడు, మార్కెట్ కమిటీ ఛైర్మన్ రాహుల్‌రెడ్డి, ఎంపిటిసీలు ప్రతిమారెడ్డి, సుదర్శన్, వైకాపా నాయకులు సంపత్, ఆగ్రోస్ డైరెక్టర్ రమణ, నాయకులు బొజ్జలనాయుడు, రాజా, రాజేంద్ర, కోటి తదితరులు పాల్గొన్నారు.

## అధిక వడ్డీలకు వెళ్ళి ఆత్మహత్యలు వద్దు : ఉమాశంకర్‌రెడ్డి

చౌడేపల్లి, నవంబర్ 17 ప్రభాతవార్త

ప్రైవేటు బ్యాంకులు, మొబైల్ యాప్‌ల్లో అధిక వడ్డీలకు రుణాలు తీసుకొని చెల్లించలేక ఆత్మహత్యలకు పాల్పడరాదని కెవిస్ రూరల్ మీడియా కళాజాతర ప్రతినిధి రవికుమార్, కెనరా బ్యాంకు మేనేజర్ ఉమాశంకర్‌రెడ్డిలన్నారు. స్థానిక ఐకెపి భవనంలో కెనరాబ్యాంకు వారి ఆధ్వర్యంలో నాబార్డు సౌజన్యంతో మహిళా సంఘాలకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సును ఏర్పాటు చేసారు. ఏపిఎం నర్సోత్తమరెడ్డి, సిసిలు, స్వయంసహాయక సంఘాల మహిళలు పాల్గొన్నారు.

## ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటుచేయాలి

శాంతిపురం, నవంబర్ 17 ప్రభాతవార్త

రైతులకు గతంలో సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన ధరల స్థిరీకరణ నిధి హామీని మూడు వేల కోట్లతో ఏర్పాటుచేయాలని మండల టిడిపి అధ్యక్షుడు భాష్యం విశ్వనాథనాయుడు ప్రకటనలో డిమాండ్ చేశారు. టమోటా రైతులు దారుణంగా నష్టపోతున్నారని, పెట్టిన పెట్టుబడులు రాక ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటుచేస్తే పంటలకు ధరలు లేకుంటే ప్రభుత్వంతరపునఆదుకునేఅవకాశంఉంటుందన్నారు.ప్రభుత్వం రైతుల్ని అన్ని విధాలా ఆదుకోవాలన్నారు.

## మాజీ ఎంఎంసి ఛైర్మన్ సత్యేంద్రశేఖర్‌చే అన్నదానం

కుప్పంరూరల్, నవంబర్ 17 ప్రభాతవార్త



కుప్పం మాజీ ఎంఎంసి ఛైర్మన్ సత్యేంద్రశేఖర్ కుటుంబీకులు గురువారం కుప్పంలో పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. తన తండ్రి దివంగత సుందరయ్య జ్ఞాపకార్థం సుమారు 500మందికి ఎన్టీఆర్ విగ్రహం వద్ద మొబైల్ అన్న క్యాంటీన్ ద్వారా అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో పిఎస్ సతీష్, సుగుణమ్మ, నరేష్, పలువురు పాల్గొన్నారు.

## ఆర్థిక అక్షరాస్యత సమాజ ఆవిష్కరణకు కంకణం

– లీడ్ బ్యాంకు మేనేజర్ శేషగిరిరావు

చిత్తూరు, నవంబర్ 17 ప్రభాతవార్త:



సమాజంలో ప్రతి ఒక్కరు ఆర్థిక అక్షరాస్యత కల్గించేలా ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలని లీడ్ బ్యాంకు మేనేజర్ శేషగిరిరావు అన్నారు. డిఆర్‌డిఎ సమావేశభవనంలో గురువారం జరిగిన జాతీయ అవగాహన సదస్సులో స్వయం సహాయక సంఘాల మహిళలకు ఆర్థిక అక్షరాస్యత, సైబర్ నేరాలు, ప్రధాన మంత్రి బీమా యోజనపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎల్‌డిఎం శేషగిరిరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజలకు అందుబాటులో వుండేవిధంగా ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్షా బీమా యోజన పథకం ద్వారా 2 లక్షల రూపాయల ప్రమాద బీమా పథకాలను తీసుకువచ్చిందన్నారు. సైబర్ క్రైం ఇన్స్‌పెక్టర్ భాస్కర్ మాట్లాడుతూ డబ్బులు ఎవరికి ఊరికే రాదని కష్టార్జితంను కాపాడుకోవాలన్నారు.సప్తగిరి గ్రామీణ బ్యాంకు మేనేజర్ దాశరథి, డిఆర్‌డిఎ ఎపిడి నాగేశ్వరరావు,ఎస్ఐఉమామహేశ్వరరావు,బ్యాంకుఅధికారులు,వివిధబ్యాంకుల ఖాతాదారులు పాల్గొన్నారు.

## ఇళ్ళ నిర్మాణాలు వేగవంతం

పూతలపట్టు, నవంబర్ 17 ప్రభాతవార్త:



జగనన్న ఇళ్ళ నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేసి లబ్ధిదారులు ఇంటి యాజమానులు కావాలని ఎంపిడిఓ గౌరి పేర్కొన్నారు. మండలంలోని గొడుగుచింత గ్రామంలో జరుగుతున్న జగనన్న ఇళ్ళ నిర్మాణ లబ్ధిదారులతో గురువారం ఎంపిడిఓ గౌరి మాట్లాడారు. ప్రభుత్వం ఇళ్ళు లేని నిరుపేదలకు సొంత ఇంటికి యాజమాని చేయాలని భావించి జగనన్న ఇళ్ళ నిర్మాణాలకు శ్రీకారం చుట్టిందని ఈ కార్యక్రమంను సద్వినియోగం చేసుకొని ఇళ్ల మంజూరు అయిన లబ్ధిదారులు వేగంగా నిర్మాణాలు పూర్తి చేసుకొని సొంత ఇంటికి యాజమాని కావాలన్నారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు తలపులపల్లి బాబురెడ్డి, జయచంద్రారెడ్డి, సుధాకర్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, ప్రవీణ్, సుబ్రమణ్యం, పంచాయతీ కార్యదర్శి శ్రీదేవి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## టెన్త్ ర్యాంకు విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం

గుడిపాల, నవంబర్ 17 ప్రభాతవార్త:

మండలంలోని శ్రీరంగంపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో గత ఏడాది టెన్త్ పరీక్షల్లో పాఠశాల స్థాయిలో మొదటి రెండు ర్యాంకులు సాధించిన ఇద్దరు విద్యార్థులకు అదే గ్రామంకు చెందిన డాక్టర్ కేశవులు గురువారం నగదు ప్రోత్సహకాలను అందజేశారు. పాఠశాల స్థాయిలో మొదటి ర్యాంకు సాధించిన ఆశ్వినికి 10 వేల రూపాయలు, రెండవ ర్యాంకు సాధించిన రంజిత్‌కు 5 వేల రూపాయలను ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్మాస్టర్ మధు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఫ్రెండ్లీ పోలీసింగ్‌పై విద్యార్థులకు అవగాహన

యాదమరి, నవంబర్ 17 ప్రభాతవార్త:

యాదమరి జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం ఎస్ఐ సుమన్ ఆధ్వర్యంలో టెన్త్ విద్యార్థులకు ఫ్రెండ్లీ పోలీసింగ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఎస్ఐ సుమన్ మాట్లాడుతూ మంచి అలవాట్లను పెంపొందించుకొని చెడు అలవాట్లను విడిచిపెట్టాలన్నారు. ప్రతి విద్యార్థి విద్యార్జనే లక్ష్యంగా పెట్టుకొని ముందడుగు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్మాస్టర్ గిరిరాజా, పాఠశాల తల్లిదండ్రుల కమిటీ ఛైర్మన్ రాజారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పంచాయతీల ఆదాయానికి గండి

పాలసముద్రం, నవంబర్ 17 ప్రభాతవార్త:

గ్రామ పంచాయతీలకు ఆదాయ వనరుగా వున్న చేపల చెరువులను ఈ ఏడాది వేలం వేయకుండానే అధికారులు ఏకపక్షంగా లీజుకు ఇవ్వడంపై మండలంలో సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రతి ఏడాది చెరువుల వేలం నిర్వహించి పంచాయతీలకు ఆదాయం సమకూర్చుకోవడం అనవాయితీగా వస్తోంది. అయితే ఈ ఏడాది ఇప్పటి వరకు చేపలు పట్టుకోవడం కోసం మండలంలోని చెరువులను వేలం వేయకుండానే ఇది వరకు లీజుదారులుగా వున్న వ్యక్తులకు మళ్ళీ అధికారులకు లీజుకు ఇవ్వడంతో పంచాతీల ఆదాయంకు గండి పడిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. పాలసముద్రం మండల పరిధిలో పాలసముద్రం, ఆముదాలపుత్తూరు, బాలకృష్ణాపురం పంచాయతీల్లో ఒకొక్క చెరువు, వనదుర్గాపురం, వెంగళ్రాజుకుప్పం పంచాయతీల పరిధిలో రెండేసీ చెరువులు వున్నాయి. పంచాయతీ అధికారులు ప్రతి ఏటా చెరువుల వేలం నిర్వహించడానికి గ్రామంలో దండోరా వేసి నిర్ధేశించిన సమయంలో వేలం నిర్వహిస్తారు. నిబంధనల మేరకు చెరువుల వేలం నిర్వహించి అధిక పాట పాడిన వారికి చేపలు పట్టుకోవడానికి చెరువులను అప్పగించాలని ఆయన కోరారు.

## ఐరాలలో ఘనంగా కవిసమ్మేళనం

ఐరాల, నవంబర్ 16 ప్రభాతవార్త:

మండల కేంద్రం ఐరాలలో జరుగుతున్న 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఐరాల జిల్లా గ్రంథాలయ సంస్థలో లైబ్రరేరియన్ సుజాత ఆధ్వర్యంలో గురువారం కవిసమ్మేళనం కార్యక్రమం ఘనంగా జరిగింది. గ్రంథాలయం సంస్థలో ఈనెల 14 నుండి 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు జరుగుతున్నవిషయం విధితమే. ఈసందర్భంగా గురువారం కవిసమ్మేళనం కార్యక్రమంను నిర్వహించారు. ఈమేరకు ప్రముఖ కవులచే కవిసమ్మేళనం నిర్వహించారు. అనంతరం వారిని గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలోఘనంగాసత్కరించారు.లైబ్రరేరియన్ సుజాతలతోపాటుఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## మూడు రాజధానులు బూటకం

పలమనేరు,నవంబర్ 17,ప్రభాతవార్త:



మూడు రాజధానులు బూటకమని ప్రజలను తప్పు దారి పట్టించడానికి వైకాపా ప్రభుత్వం చేస్తున్న కుట్రని పలమనేరు టిడిపి నాయకులు విమర్శిం చారు. పట్టణంలోని టిడిపి కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే డా.వెంకటేగౌడా చేపట్టిన రాష్ట్ర వికేంద్రీకరణకు మద్దతు కార్యక్రమాన్ని టిడిపి నాయకులు ఖండిచారు.ఈ సందర్భంగా నాయకులు గిరి,ఖజాఫీర్,గ్యాస్ నాగరాజు మాట్లాడుతూ అసెంబ్లీ దేవాలయంతో సమానమని అటువంటి అసెంబ్లీ సాక్షిగా ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టమని,అమరావతిలో సుమారు రాజధాని అభివృద్ధికి సుమారు 30వేల ఎకరాలు కావాలని తెలిపిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేడు మాటమార్చడం సరికాదని విమర్శించారు.సోమశేఖర్ గౌడ్,ఆర్‌బిసి కుట్టి,సుబ్రమణ్యం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## డీజల్ దొంగతనం కేసులో ముగ్గురు అరెస్టు

పలమనేరు,నవంబర్ 17,ప్రభాతవార్త:

పలమనేరులో డీజల్ దొంగతనం కేసులో ముగ్గురిని అరెస్టు చేసినట్లు సిఐ చంద్రశేఖర్ తెలిపారు.గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని జాతీయ రహదారిలో రాత్రి వేళలలో ఆగివున్న లారీలలో డీజల్‌లను దొంగలిస్తున్నారని వచ్చిన ఫిర్యాదు మేరకు జాతీయ రహదారిలోని సిసి కెమెరాల సహాయంతో పట్టణంలోని పాతపేటకు చెందిన నవీన్,ఎస్ఆర్ జబ్బర్,గంగవరం డ్రైవర్స్ కాలనీకి చెందిన కిరణ్‌కుమార్‌లు ఆటో,ద్విచక్రవాహనాలలో దొంగతనం చేసిన డీజల్‌ను తరలిస్తున్న విషయాన్ని గుర్తించామని,ఈ మేరకు వారిని అరెస్టు చేసి రిమాండుకు తరలించడం జరిగిందని తెలిపారు.

## ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన తప్పనిసరి ఎస్సై స్వర్ణతేజ

పెద్దపంజాణి నవంబర్ 17 ప్రభాతవార్త :

సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన తప్పనిసరి అని నానాటికి సైబర్ నేరాలు అధికం కావడానికి ప్రజల అవగాహన రాహిత్యమని ఎస్సై స్వర్ణతేజ తెలిపారు.గురువారం మండలంలోని రాయలపేట జెడ్పీహైస్కూల్‌ప్రాంగణంలోఏర్పాటుచేసినసైబర్‌క్రైంఅవగాహనసదస్సులోఆమె మాట్లాడు తూ..దోపిడి, దొంగతనాలు తగ్గుతున్నప్పటికి సైబర్ నేరాలు అధికమౌతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.రత్నమ్మ,పాఠశాల కమిటీ ఛైర్మన్ కె.నరసింహులు, ఉపాధ్యానీ ఉపాధ్యాయులు,విద్యార్థుల తల్లిదండ్రులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ నిబంధనల మేరకు మద్యం అమ్మకాలు

గుడిపాల, నవంబర్ 17 ప్రభాతవార్త:

మద్యం షాపుల్లో ప్రభుత్వ నిబంధనల మేరకు మద్యం అమ్మకాలు నిర్వహించాలని ఎక్సైజ్ ఎస్ఐ వెంకటేష్ పేర్కొన్నారు. మండలంలోని బొమ్మసముద్రం, నరహరిపేట, రెట్టగుంట గ్రామాల్లోని మద్యం షాపులను గురువారం ఎక్సైజ్ డిపో మేనేజర్ దయాసాగర్ ఆదేశాల మేరకు ఎక్సైజ్ ఎస్ఐ వెంకటేష్ తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ కానిస్టేబుళ్ళు వెంకటేశ్, పరమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## చిరుధాన్యాలతో మంచి ఆరోగ్యం

సదుం, నవంబరు 17ప్రభాతవార్త



పూర్వకాలంలో అందరు చిరుధాన్యాలు తిని మంచి ఆరోగ్యం పెంపొందించుకున్నారని ఇప్పుడు మళ్ళీ చాలా మంది చిరుధాన్యాల వైపు మళ్ళు తున్నారని జడ్పీటీసీ సోమశేఖరరెడ్డి, ఎంపీపీ ఎల్లప్పలు అన్నారు. గురువారం మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో చిరుధాన్యాలతో తయారు చేసిన పౌష్టికాహారం ప్రదర్శనను వారు ప్రారంభించారు. ఈసందర్భంగా చిరుధాన్యాలతో తయారు చేసిన వంటకాలను ప్రదర్శించి ఉత్తమ ప్రతిభ కనపరచిన వారికి బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మంత్రి పెద్దిరెడ్డి పిఈ మురళీకృష్ణారెడ్డి, ఎంపీడీఓ వరప్రసాద్, ఎంఈఓ శ్రీరాములు, పాలమంద సర్పంచి మనోహరరెడ్డి, ఏపీఎం హరిప్రసాద్, సీసీలు మధుసూధన్‌రెడ్డి, బానుకుమార్,రమేష్‌బాబు, సుజాత, ఎస్ఎన్‌మేనేజరు రమ్యసాయి,సంఘమిత్రలు, మండల సమాఖ్య ఈసీ సభ్యులు పాల్గొన్నారు.

## డీసీసీబ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకోండి

సదుం,నవంబరు17ప్రభాతవార్త



స్వయం సహాయక సంఘాల మహిళలు డీసీసీ బ్యాంకు అందించే రుణాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తంరెడ్డి అన్నారు. గురువారం మండల సమాఖ్య కార్యాలయంలో రుణాలపై మహిళలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాలు ఆహార పదార్థాలను తయారుచేసి విక్రయించేందుకు సబ్సిడీ రుణాలు అందిస్తున్నామన్నారు.ఒక్కోసభ్యురాలికిరూ.40వేలవరకు రుణం ఇస్తామని చెప్పారు. అందులోరూ.15వేలు సబ్సిడి పోతుందన్నారు. మొదటి విడతగా మండలంలో40 యూనిట్లు రుణాలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.కార్యక్రమంలోజడ్పీటీసీరెడ్డీశ్వరరెడ్డి,డీసీసీబ్యాంకుడైరెక్టర్ దేవులపల్లె హరినాథరెడ్డి,డీసీసీ బ్యాంకుచిన్నగొట్టిగల్లు బ్రాంచి మేనేజరు సులోచనారాణి,ఎంపీడీఓ రాజేంద్ర, తహశీల్దారు మురాషావలి, ఏపీఎం బ్రహ్మానందరెడ్డి, సీసీలు ఆదినారాయణస్వామి, రమణారెడ్డి, సంఘమిత్రలు పాల్గొన్నారు.

## ఉచిత పశువైద్య శిబిరం

యర్రావారిపాలెం,నవంబరు17ప్రభాతవార్త



మండల పరిదిలోని కోటకాడ పల్లె పంచాయతీ పరిదిలోని తడికెలచేనుపల్లెలో గురువారం శ్రీజడైరీ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్యశిబిరం నిర్వహించారు. పశువైద్యుడు జగన్మోహన్‌రెడ్డి పశువులకు సంబంధించిన వ్యాధులు, తీసుకోవలసిన జాగ్రత్తల గురించి రైతులకు తగిన సూచనలు అందించారు. . కార్యక్రమంలో సూపర్‌వైజర్ నాగరాజు, సిబ్బంది కేశవ్,పాలమిత్ర చిన్నపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## దళితుల సమరభేరిని జయప్రదం చేయండి

చిత్తూరురూరల్, నవంబరు 17 ప్రభాతవార్త:

ఈ నెల 24వ తేది తిరుపతిలో జరగనున్న దళితుల సమరభేరిని జయప్రదం చేయాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్, కార్పొరేటర్ అశోక్‌లు కోరారు. గురువారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వం దళితులను విద్యకి, ఉపాధికి దూరం చేసే కుట్ర పన్నుతున్నారని పేర్కొన్నారు. దళితులపై అత్యాచారాలు, విద్యా, ఉద్యోగాలలో దళిత అధికారులకు ప్రాధాన్యత లేనటువంటి పోస్టులతో అన్యాయం జరుగుతోందన్నారు. ఇంత జరుగుతున్న వైసిపిలో వున్న దళిత ఎమ్మెల్యేలు, ఎంపిలు, మంత్రులు కనీసం నోరు తెరచి మాట్లాడే పరిస్థితి లేదన్నారు. వీటన్నింటిని ప్రశ్నించడానికి తిరుపతిలో దళితుల సమరభేరి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో టిడిపి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, కార్పొరేటర్ అశోక్, పార్టీ కార్యాలయ కార్యదర్శి మోహన్‌రాజ్, జిల్లా కార్యదర్శి క్రిష్ణమూర్తి, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు రాజా, తవణంపల్లె బిసి సెల్ అధ్యక్షుడు వినాయక, పూతలపట్టు బిసి సెల్ అధ్యక్షుడు ధరణి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## నిరాశ్రయుల వసతిగృహాన్ని పరిశీలించిన ట్రైనీ కలెక్టర్

చిత్తూరురూరల్, నవంబరు 17 ప్రభాతవార్త:

నిరాశ్రయుల వసతిగృహాన్ని ట్రైనీ కలెక్టర్ మేఘస్వరూప్, మెప్మా పిడి రాధమ్మతో కలసి గురువారం పరిశీలించారు. నిరాశ్రయులు వేర్వేరు ప్రాంతాల నుండి వచ్చి ఒకే కుటుంబ సభ్యులుగా కలిసిమెలసి వుండడం ఎంతో సంతోషంగా వుందన్నారు. ప్రభుత్వం నిరాశ్రయుల కోసం ఎల్లప్పుడు అండగా వుంటుందన్నారు. అలాగే సపోర్టు సంస్థ జోసప్‌రాజు అందిస్తున్న సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. అనంతరం నిరాశ్రయులకు దుప్పట్లు, అన్నదానం చేసారు. ఈ కార్యక్రమంలో మెప్మా గోపి, వసతిగృహ సిబ్బంది ప్రమీల, ప్రసన్న, బాబు తతదితరులు పాల్గొన్నారు.

## పాలసముద్రం-బెంగళూరుకు ఆర్టీసీ బస్సు నడపడానికి సర్వే

పాలసముద్రం, నవంబర్ 17 ప్రభాతవార్త:



పాలసముద్రం, బలిజకండ్రిగ నుండి బెంగళూరు వరకు ఆర్టీసీ బస్సు నడపడానికి గురువారం చిత్తూరు ఆర్టీసీటు డిపో మేనేజర్ రూపశ్రీ ఆధ్వర్యంలో ఆర్టీసీ సిబ్బంది ట్రయల్ రన్ నిర్వహించారు. మండల జడ్పీటీసీ అన్బుగలన్, మండల పార్టీ కన్వీనర్ తులసీయాదవ్, వైఎస్ ఎంపిపి శేఖర్ యాదవ్‌లు ఇటీవల డిప్యూటీ సిఎం నారాయణస్వామి, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ విజయానందంరెడ్డిలను కలిసి చిత్తూరు నుండి పొన్నై, అమియర్ కుప్పం, పాలసముద్రం, బలిజకండ్రిగ, వనదుర్గాపురంల మీదుగా బెంగళూరు వెళ్ళడానికి ఒక బస్సు సర్వీసు నడపాలని విన్నవించారు. అలాగే పాఠశాల విద్యార్థుల కోసం ఒక బస్సు సర్వీసు నడపాలని కోరారు. ఆర్టీసీ వైస్ ఛైర్మన్ విజయానందరెడ్డి ఆర్టీసీ అధికారులను ఆదేశించడంతో గురువారం టు డిపో డిఎం రూపశ్రీ, సిబ్బంది వచ్చి బస్సు నడపడానికి ట్రయల్ రన్ నిర్వహించారు. బెంగళూరుకు ఆర్టీసీ సర్వీసు నడపడానికి చొరవ తీసుకొన్న జడ్పీటీసీ అన్బుగలన్, మండల వైకాపా కన్వీనర్ తులసీయాదవ్‌లను జాతీయ మానవ హక్కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గురుప్రసాద్ అభినందించారు. ఆదివారం నుండి ఈ సర్వీసును ప్రారంభిస్తున్నట్లు ఆర్టీసీ టుడిపో మేనేజర్ రూపశ్రీ పేర్కొన్నారు.

## వికేంద్రీకరణతోనే అభివృద్ధి

- పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

బంగారుపాళ్యం, నవంబర్ 17 ప్రభాతవార్త:

వికేంద్రీకరణతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు పేర్కొన్నారు. గురువారం బంగారుపాళ్యంనందు వికేంద్రీకరణకు మద్దతుగా భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుండి బస్టాండ్ వరకు ఈ ర్యాలీ చేపట్టి నాలుగు రోడ్ల కూడలి వద్ద మానవహారం నిర్వహించారు. అంతకుముందు అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజధాని ఒకే




ప్రాంతంలో వుంటే ఆ ప్రాంతం ఒక్కటే అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం మూడు రాజధానులను తీసుకువచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ ఛైర్మన్ భూమిరెడ్డి ధనంజయరెడ్డి, మాజీ జడ్పీ ఛైర్మన్ కుమార్‌రాజా, ఎంపిపి అమరావతమ్మ, జడ్పీటీసీ సోమశేఖర్, వైస్ ఎంపిపి శిరీష్‌రెడ్డి, నియోజకవర్గ పరిధిలోని వైకాపా మండల కన్వీనర్లు, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు. అలాగే పలువురు సర్పంచ్‌లు, ఎంపిటిసీలు, సచివాలయ ఉద్యోగులు, డ్వాక్రా మహిళలు, గ్రామ వాలంటీర్లు అధిక సంఖ్యలో ర్యాలీలో పాల్గొని జయప్రదం చేశారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## మోటార్‌సైకిల్ బోల్తా -ఇద్దరికి తీవ్రగాయాలు ....

నాయుడుపేట రూరల్ నవంబరు 17 ప్రభాతవార్త ;

నాయుడుపేట మండలంలోని శ్రీనివాసపురం సమీపంలో జాతీయ రహదారిపై మోటార్‌సైకిల్ బోల్తాపడి ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడిన సంఘటన గురువారం రాత్రి జరిగింది. వివరాలిలా ఉన్నాయి.నాయుడుపేటకు చెందిన విజయ్‌కుమార్,రామాంజన్‌లు మోటార్‌సైకిల్‌పై దొరవారిసత్రంకు వెళ్ళి పనులు పూర్తిచేసుకొని తిరిగి ఇంటికి వస్తున్న సమయంలో మార్గమధ్యలో నాయుడుపేట మండలం శ్రీనివాసపురం వద్ద వచ్చేరికి ముందుగా వెళుతున్న లారీని క్రాస్‌చేయబోయి మోటార్‌సైకిల్ అదుపుతప్పి ప్రమాధవశాత్తు బోల్తాపడింది.దీంతో మోటార్‌సైకిల్‌పై ప్రయాణిస్తున్న విజయ్‌కుమార్,రామాంజన్‌లు తీవ్రంగా గాయపడ్డారు.స్థానికులు క్షతగాత్రులను 108సహయంతో చికిత్సనిమిత్తం నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.పోలీసులు కేసునమోదుచేసి ధర్యాప్తు చేస్తున్నారు.

## వైకాపా నేత సర్పంచ్ తల్లి మృతి

వాకాడు, నవంబర్ 17, ప్రభాతవార్త

మండల పరిధిలోని తూపిలి గ్రామపంచాయితీ సర్పంచ్ సిద్ధారెడ్డి మధుసూధన్ రెడ్డి తల్లి సిద్ధారెడ్డి అన్నపూర్ణమ్మ (82) గురువారం సాయంత్రం అకస్మాత్తుగా మృథి చెందారు. అన్నపూర్ణమ్మ మృతికి వాకాడు సొసైటీ ఛైర్మన్ కొడవలూరు దామోదర్ రెడ్డి, సర్పంచ్ సంఘం అధ్యక్షుడు, కల్లూరు సర్పం చిదువ్వూరు విజయభాస్కర్ రెడ్డి, వాకాడు ఏఎంసి ఛైర్ పర్సన్, వాకాటి నాగభూషణమ్మ, వాకాడు ఉప సర్పంచ్ పాపా రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, వాకాడు మండలం వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ దువ్వూరు అజిత్ కుమార్ రెడ్డి, ముట్టింబాక సర్పంచ్, అనిల్ కుమార్ రెడ్డి, మాజీ సర్పంఛ్ ద్వారకానాథ్ రెడ్డి, వైకాపా నాయకులు ఏనుగు సుధాకర్ నాయుడు, వాకాటి రవి, నూతలపాటి వెంకటరమణయ్య, మండల స్థాయినాయకులు వైసిపి ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేసారు. మధుసూధన్‌రెడ్డిని పరామర్శిం చారు.

## ఆగని వీధిదీపాలు

దొరవారిసత్రం, నవంబర్ 17 ప్రభాతవార్త



దొరవారిసత్రం మండలం అక్కరపాక, పోలిరెడ్డిపాలెం, మావిళ్లపాడు, తనయాలి, బూదూరు తదితర గ్రామాల్లోని వీధుల్లో స్తంభాలకు విద్యుద్దీపాలు నిరంతరం వెలుగుతూనే ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. విద్యుత్ స్తంభాలకు గతంలో వేల రూపాయలు నిధులను కేటాయించి, ఆ నిధుల ద్వారా విద్యుద్దీపాలు వెలిగించి అక్కడక్కడా కంట్రోల్ బాక్సులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అయితే ఆ కంట్రోల్ బాక్సులను ఏర్పాటు చేయకపోవడంతో నిరంతరం పగలు రాత్రి తేడా లేకుండా విద్యుద్దీపాలు వెలుగుతూనే ఉన్నాయి. దీంతో విద్యుత్ వృధా అవుతోంది.

## రసాభాసగా మారిన సర్వసభ్య సమావేశం

కోట, నవంబర్ 17 ప్రభాతవార్త



కోట మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీపీ దాసరి అంజమ్మ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సభలోనే పలు శాఖల అధికారులు అభివృద్ధి పనులు, తమ శాఖల పురోగతిపై వివరించారు. సభలో తెలుగుదేశం పార్టీ ఎంపీటీసీ సభ్యులు దాసరి సురేష్‌మాట్లాడుతూ దళితవాడలో రోడ్లు, డ్రైనేజి, మంచినీటి సరఫరా అస్తవ్యస్తంగాఉందనిఆరోపించారు. ఇటీవల కురిసిన వర్షాలకు మూడు అడుగుల లోతులో ఉండాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని తెలిపారు. గత మూడేళ్లుగా సర్వసభ్య సమావేశంలో అధికారుల దృష్టికి సమస్యలను తీసుకొచ్చినా ఎలాంటి ఉపయోగం లేదన్నారు. సమస్యలను పరిష్కరించలేనప్పుడు సమావేశాలు ఎందుకని ప్రశ్నించారు. దీంతో అధికారపక్ష ఎంపీటీసీ సభ్యులు మొబిన్‌బాషా మాట్లాడుతూ కోటలో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతుంటే కనిపించలేదా అంటూ ఎదురు దాడికి దిగారు. మీ ఇంటి దగ్గర సిమెంటు రోడ్లు, డ్రైనేజి వేసుకుంటూ సరిపోతుందా అని సురేష్ మరోసారి మొబిన్‌బాషాతో వాగ్వివాదానికి దిగారు. దీంతో సభలో ఇద్దరి మధ్య వాగ్వివాదం తీవ్రస్థాయికి చేరుకుంది. ఈ సమావేశంలో ఎంపీడీఓ భవాని, తహశీల్దార్ పద్మావతి, జడ్పీటీసీ సభ్యులు దాసరి కోటయ్య, ఉపాధ్యక్షులు సౌజన్యారెడ్డి, ఉప్పల శేషయ్య, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మంత్రి రోజా జన్మదిన వేడుకల్లో పేర్నాటి ప్రసాద్ రెడ్డి

కోట,నవంబరు 17 ప్రభాతవార్త



రాష్ట్ర పర్యాటక,సాంస్కృతిక ,యువజన ,క్రీడాశాఖ మంత్రి ఆర్‌కె.రోజా జన్మదినం సందర్భంగా గురువారం నగిరిలోని మంత్రి కార్యాలయాంలో తూర్పురాయలసీమ వైకాపా పట్టభద్రుల అభ్యర్థి పేర్నాటి శ్యామ్ ప్రసాద్ రెడ్డి కలిసి జన్మదిన శుభా కాంక్షలు తెలిపారు.అనంతరం తిరుపతిలోని శాసనసభ్యులు భూమన కరుణాకర్‌రెడ్డిని తిరుపతి నియోజకవర్గంలోని పట్టభద్రుల ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు ఆయనకు శ్యామ్ ప్రసాద్ రెడ్డి కృతజ్ఞులు తెలిపారు. అక్కడ నుంచి చిత్తూరు ఆర్టీసీ ఛైర్మెన్ విజయానందరెడ్డిని కలిసి ఆర్టీసీ ఉద్యోగులను పెద్ద ఎత్తున ఓటర్లుగా నమోదు చేయించినందుకు ఆయనకు ధన్యవాదాలు తెలిపినట్లు శ్యామ్ ప్రసాద్ రెడ్డి ప్రభాతవార్తకు తెలిపారు.శ్యామ్ ప్రసాద్ రెడ్డి వెంట సిద్దవరం సొసైటి ఛైర్మెన్, పాదర్తి రాధకృష్ణరెడ్డి, దూవ్వూరు సాయి కృష్ణరెడ్డి, వెంకటరమణరెడ్డి,తదితరులు ఉన్నారు.

## చిల్లకూరు సచివాలయంలో ఏసిబి తనిఖీలు

చిల్లకూరు నవంబర్ 17 ప్రభాతవార్త

స్థానిక చిల్లకూరు సచివాలయంలో గురువారం ఏసిబి అధికారులు తనిఖీలు నిర్వహించారు. చిల్లకూరు గ్రామంలో ఓ వ్యక్తి గ్రామ వాలింటర్‌గా పనిచేసి నిలిచిపోయాడు. అయితే అప్పటి నుండి ఆ వాలంటీర్‌కి పంచాయితీ అధికారులు పనిచేయకపోయినా 72,400రూపాయాలు నగదు,వాలింటర్‌కి జీతం కింద జమ చేశారు.గ్రామస్తులు ఏసిబి అధికారులకు ఫిర్యాదు చేయడంతో వారు వెంటనే స్పందించి గ్రామ సచివాలయంలోరికార్డులుపరిశీలించారు.వారిని వివరణ కోరగా సరైన నివేదికలు పై స్థాయి అధికారులకు పంపించడం జరుగుతుందని అన్నారు.అక్రమాలకు పాలుపడి ఉంటే కఠిన చర్యలు తప్పవని అన్నారు.

## ఒక్క ఇల్లు తప్పిపోకుండా కుష్ఠు సర్వే

యాదమరి, నవంబర్ 17 ప్రభాతవార్త:



యాదమరి పిహెచ్‌సి పరిధిలో ఒక్క గృహం తప్పిపోకుండా కుష్ఠు సర్వేను పక్కాగా నిర్వహించాలని పిహెచ్‌సి సిహెచ్‌ఓ లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. వరదరాజులపల్లి సబ్ సెంటర్ పరిధిలో జరుగుతున్న కుష్ఠు సర్వేను గురువారం సిహెచ్‌ఓ లక్ష్మీనారాయణ తనిఖీ చేశారు. మహిళా ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు నిర్వహించిన సర్వేను ఆయన ఇళ్ళకు వెళ్ళి తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన వైద్య సిబ్బందితో మాట్లాడుతూ డిసెంబర్ 5వ తేదీ వరకు ఈ సర్వే జరుగుతుందని, ప్రతి ఇంటికి వెళ్ళి ప్రతి వ్యక్తిని పరీక్షించి నివేదికలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి సౌందర్య, మహిళా ఆరోగ్య కార్యకర్త అపర్ణశిల్ప, ఆశా కార్యకర్త రుబీ, వాలంటీర్లు పాల్గొన్నారు.

## వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన డిఎస్పీ శ్రీనివాసమూర్తి

చిత్తూరు, నవంబర్ 17 ప్రభాతవార్త:



చిత్తూరు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌ను గురువారం నగర డిఎస్పీ శ్రీనివాసమూర్తి అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని పలు రికార్డులను పరిశీలించిన డిఎస్పీ శ్రీనివాసమూర్తి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డిఎస్పీ శ్రీనివాసమూర్తి ఇన్స్‌పెక్టర్ నరసింహరాజుతో మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో భూతగదాలు ఎద్దైనా వస్తే తనకు సత్వరం సమాచారం అందించాలన్నారు. అలాగే ఫ్రెండ్లీ పోలీసింగ్‌పై దృష్టి కేంద్రీకరించి పోలీస్ స్టేషన్‌కు సమస్యలతో వచ్చే ప్రతి ఒక్కరితో సన్నిహితంగా మాట్లాడి వారి సమస్యలను పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే జగనన్న లక్ష్యం..పవిత్రారెడ్డి



తొట్టంబేడు, నవంబర్ 17 ప్రభాతవార్త

రైతు సంక్షేమమే జగనన్న లక్ష్యమని తొట్టంబేడు మండల ఇన్‌ఛార్జి బియ్యపుపవిత్రారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని చియ్యవరం, కాసరం, పిల్లమేడు, చిన్నకనపర్తి పంచాయతీ గ్రామ రైతుల అభ్యర్ధన మేరకు నియోజకవర్గ ఎంఎల్ఏ బియ్యపుమధుసూధన్‌రెడ్డి రైతుల పంటపొలాల వ్యవసాయం కోసం పంట కాలువలు, వరవకాలువల పనులు మంజూరు చేయించారు. ఇందులో భాగంగా గురువారం పనులను ఇన్‌ఛార్జి పవిత్రారెడ్డి భూమిపూజ చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమెకు గ్రామాల్లో ఘనస్వాగతం పలికారు. అనం తరం ఆమె మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో రైతుల సంక్షేమమే ప్రాధాన్యం అన్నారు. వైఎస్ఆర్ రైతు భరోసా ద్వారా రైతుల సంక్షేమం కోసం ప్రతి ఏటా రూ.13,500 జగనన్న రైతుల ఖాతాల్లో జమచేస్తున్నారని అంతేకాకుండా జగనన్న జలకల ద్వారా రైతులకు ఉచిత బోర్లు వేయిస్తున్నారన్నారు.వైకాపాసీనియర్‌నాయకులు ఉన్నం వా సుదేవనాయుడు మాట్లాడుతూ రైతుల ఇబ్బందులను దృష్టి లోపెట్టుకుని ఎంఎల్ఏ మధుసూధన్‌రెడ్డి ముందుచూపుతో చెరు వుల నుంచి వచ్చే వరవకాలువలు, పంటకాలువలను ఉపాధిహామీ పథకం కింద పనులు చేపట్టేందుకు చర్యలుతీసుకుంటున్నారన్నారు. అన్నదాతల కష్టాలు తెలిసిన నేతగా ఎంఎల్ఏ బియ్యపుమధుసూధన్‌రెడ్డి ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటున్నారన్నారు. కార్యక్రమాల్లో వైకాపా నాయకులతో పాటు ఎంపిడిఓ తరుణాక్షిరెడ్డి, ఎపిఓ సుజాత, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## నా పొలాల్లో నాకు హక్కు లేదా...?

నాకు ప్రాణహాని ఉంది - ఓ బాధితురాలి ఆవేదన

రేణిగుంట, నవంబరు 17 ప్రభాతవార్త:

మా అమ్మమ్మ నుంచి మా అమ్మకు మా అమ్మ నుంచి నాకు సంక్రమించిన పొలాల్లో నాకు హక్కు లేదా అంటూ రాధిక కిరణ్ ఆవేదన వ్యక్తం చేశారు. రేణిగుంట ఐటీ హబ్ వద్ద ఏర్పేడు మండలం జింకల మిట్ట సర్వే నెంబర్లు 427/9లో 38 సెంట్లు, 428/4లో ఒక ఎకరా 5 సెంట్లు భూమి గత 30 సంవత్స రాలుగాతనఅమ్మమ్మనుంచితనవరకుస్వాధీనంలోఉన్నాయన్నారు.సుబ్బయ్యగుంట, జింకలమిట్టకు చెందిన వ్యక్తులు బలమైన సిఫార్సులతో పొలాల్లోకి వెళ్ళనీవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఏర్పేడు పోలీస్‌స్టేషన్‌ల్లోఫిర్యాదుచేసినా ఫలితం శూన్యమన్నారు. పైన పేర్కొన్న వ్యక్తులు వల్ల తనకు ప్రాణహాని ఉందన్నారు.వెంటనేపోలీసులు, అధికారులు జోక్యం చేసుకుని తనకు న్యాయం చేయాలని అభ్యర్థించారు.

## టిడిపి నుంచి వైకాపాలోకి . . .



శ్రీకాళహస్తి రూరల్,నవంబర్ 17 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి నియోజకవర్గంలో వైకాపా రోజు రోజుకు బలపడుతుంది. గ్రామీణ ప్రాంతాల్లో తెలు గుదేశం పార్టీని ఖాళీ చేయించటంలో శాసనస భ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి యువకులను ఆకర్షిస్తున్నారు.ఈనేపధ్యంలోమండలంలోనిగోవిందవరం గ్రామాని కి చెందిన టిడిపి మద్దతు దారులు తిరుచానూరు నరేంద్ర వారి మిత్రబృందంతో కలసి శాసనసభ్యుడు సమక్షంలో కండువా వేసుకున్నారు.

## ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించరాదు

నగరంలో ముమ్మరంగా ద్విచక్ర వాహనాల తనిఖీలు



తిరుపతి క్రైం, నవంబర్ 17, ప్రభాతవార్త

ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించి బైక్ రైడింగ్ చేస్తే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. జిల్లా ఎస్పీ పరమేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు ట్రాఫిక్ పోలీసులు ప్రధాన హైవే రోడ్డుపై పెట్రోలింగ్ చేస్తూ వాహనాలను తనిఖీలు నిర్వహించారు. లైసెన్స్ లేని, ర్యాష్ డ్రైవింగ్ చేసే వారిని గుర్తించి కౌన్సెలింగ్ ఇవ్వడంతో పాటూ కేసు నమోదు చేసారు. తనిఖీల్లో మొత్తం 36 వాహనాలను ట్రాఫిక్ పోలీసులు సీజ్ చేసారు. ఇందులో త్రిబుల్ రైడింగ్ 16 సెల్ఫోన్ డ్రైవింగ్ 4 మైనర్ డ్రైవింగ్ ఆరు లైసెన్స్ లేని వాహనాలు 10 మొత్తం 36 వాహనాలను సీజ్ చేసి చర్యలు తీసుకున్నారు. ట్రాఫిక్ డిఎస్పి కాటమరాజు ఆధ్వర్యంలో ట్రాఫిక్ సిఐ భాస్కర్ రెడ్డి సిబ్బంది నగరంలో విస్తృతంగా వాహనాలు తనిఖీలు చేపట్టారు.

## మహిళలు ఆర్థిక శక్తులుగా ఎదగాలి

తిరుపతిరూరల్, నవంబర్ 17 ప్రభాతవార్త:

మహిళలు ఆర్థిక శక్తులుగా ఎదగాలని సెర్ప్ సిఇవో ఏఎండి ఇంతియాజ్ అన్నారు. గురువారం జీవనోపాధుల కేంద్రంలో జరిగిన తిరుపతి జిల్లా సమాఖ్య సమావేశానికి సెర్ప్ సిఇవో ఏఎండి ఇంతియాజ్ ముఖ్యఅతిథిగా విచ్చేసారు. ముందుగా జీవనోపాధుల కేంద్రం ఆవరణలో టెంకాయ, జామ చెట్లను నాటారు. అలాగే చిరుధాన్యాల ప్రదర్శన స్టాల్స్‌ను ప్రారంభించారు. నారాయణవనం చేనేత కార్మికులకు సామూహికంగా మగ్గాలు నేసుకునేందుకు ప్రతిపాదనలు ఏర్పాటు చేసి, అందుకు కావాల్సిన ఆర్థిక సహాయం కూడా కల్పించాలన్నారు. మహిళలు చేస్తున్న ఉత్పత్తులను ఆన్‌లైన్‌లో పెట్టాలన్నారు. జిల్లా సమాఖ్యకు ఆధాయ మార్గంగా 100 కంప్యూటర్లను పెట్టి ఆన్‌లైన్ ద్వారా జరిగే పోటీ పరీక్షలను మనమే నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఓ కనకనరసారెడ్డి, డిఆర్‌డిఏ ప్రాజెక్టు డైరెక్టర్ జ్యోతి, ఏపిడి ప్రభావతి,డిపిఎం మాధవి, ధనంజయరెడ్డి, వైయస్సార్ పథకం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## భారతీయ గ్రంథాలు జ్ఞాన భాండాగారాలు



రేణిగుంట, నవంబరు 17 ప్రభాతవార్త:

భారతదేశంలో ఉదయించిన గ్రంథాలన్నీ నిజమైన జ్ఞాన భాండాగారాలని ప్రముఖ వక్తలు శాంత, సౌజన్య, త్యాగరాజు అన్నారు. జాతీయ గ్రంథాలయ వార్షికోత్స వాల్లో భాగంగా గురువారం లైబ్రరీ అధికారి శ్రీముఖి ఆధ్వర్యంలో ప్రముఖ కవులపై ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సంస్కృత కవులు, తెలుగు కవులు, భారతదేశానికి చెందిన వివిధ భాషల కవుల గురించి సంక్షిప్తంగా తెలియజేశారు. వారు రాసినగ్రంథాలను వివరించారు.పురాణ,ఇతిహాస,చారిత్రాత్మక,సాంఘికకవులురచయితలగురించి తెలిపారు.

## ప్రజాసేవలో పద్మావతి మహిళా అభ్యుదయ సంఘం

-250 మంది మహిళలకు ఉచిత కంటి పరీక్షలు



తిరుపతి ప్రెస్‌క్లబ్,నవంబర్ 17 ప్రభాతవార్త:

తిరుపతి నగరంలో గత 34 ఏళ్లుగా శ్రీ పద్మావతి మహిళా అభ్యుదయ సంఘం 550 స్వయం సహాయక సంఘాలను కలిగి,స్వీయ నియంత్రణలో సుస్థిరమైన ప్రజా సంస్థగా ఎదిగి ఎన్నో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ,6 వేల 200 మహిళా కుటుంబాల అభివృద్ధికి కృషి చేస్తోందని సంఘం మేనేజింగ్ డైరెక్టర్ వెంకట మురుగేష్ తెలిపారు.గురువారం మీడియాతో ఆయన మాట్లాడుతూ స్థానిక అరవింద్ కంటి ఆసుపత్రి సిబ్బందిచే తమ సంఘం కార్యాలయం నందు సంఘంలోని సభ్యులు 250 మందికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు. మరో 186 మందికి బి.పి,షుగర్ పరీక్షలు నిర్వహించామన్నారు.ఈ ఉచిత కంటి పరీక్ష కార్యక్రమంలో ఆసుపత్రికి చెందిన డా॥వేదేష్,డా॥వినయశ్రీల ఆధ్వర్యంలో15మంది నర్సులు కలిసి వైద్య సేవలు అందించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో భాగంగా సంఘం వైస్ చైర్మన్ నీరజ కంటి పరీక్షకు వచ్చిన అందరికీ అన్నదానం చేశారు.ఈ కార్యక్రమంలో హెల్త్‌కో-ఆర్డినేటర్‌ఆర్.ప్రమీల,సంఘంచైర్‌పర్సన్‌పి.జయమ్మ,సిఇఓలు ధర్మేంద్ర, మోహన్,కోశాధికారి ఎం.రత్నమ్మ,ఇతర బోర్డు సభ్యులతో పాటు సంఘం కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## బాలలంతా విద్యావంతులు కావాలి - ప్రగతి జయలక్ష్మి



రేణిగుంట, నవంబరు 17 ప్రభాతవార్త:

బాలలను విద్యావంతులను చేస్తే వారి హక్కులను తెలుసుకుంటారని ప్రగతి స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ కె.వి.రమణ అన్నారు. రేణిగుంట మండలంలో నవంబరు 14 నుంచి వివిధ గ్రామాల్లో జరుగుతున్న బాలల హక్కుల వారోత్స వాల్లో భాగంగా గురువారం కరకంబాడి, మల్లవరం, గుత్తివారిపల్లి పాఠశాలల్లో ప్రగతి స్వచ్ఛంద సేవా సంస్థ బెంగలూరు క్రై సంస్థ ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ బాలలకు ప్రభుత్వాలు ఎన్నో హక్కులు కల్పించాయన్నారు. ఆ హక్కులకు భంగం కలిగిస్తే శిక్షలు కఠినంగా ఉంటాయన్నారు. పిల్లలను పనుల్లోపెట్టడం, బాల్య వివాహాలు చేయడం హింసించడం కఠినమైన నేరం అన్నారు. కార్యక్రమంలో కార్యక్రమంలో మండల కో-ఆర్డినేటర్ జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## మహిళల ఆర్థిక స్థితి గతుల్ని మార్చేస్తున్న హస్తకళలు



శ్రీకాళహస్తిరూరల్,నవంబర్ 17 ప్రభాతవార్త

చేతి వృత్తులు, గ్రామాల్లో చిన్న పరిశ్రమలతో పాటు హస్తకళలతో మహిళల ఆర్థిక స్థితి గతులు మారుతున్నాయని మహిళల ఉత్సా హానికి ప్రభుత్వం చేయూత నిస్తుందని కేంద్రగ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ సిఇఓ ఇంతియాజ్ అన్నారు. గురువారం ఆయన ఎపి టూరిజం వద్ద నిర్వహిస్తున్న హస్తకళల యూనిట్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైయస్ఆర్ క్రాంతి పథం మండల సమాఖ్య సారధ్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాలకు ఆయన హాజరయ్యారు.మహిళలు కలంకారి,కొయ్యబొమ్మల తయారి ఇతర చేతి వృత్తుల ద్వారా సుస్థిర జీవనోపాధికి పూర్తి సహాకారం అందించుటకు ప్రభుత్వం ముందుకు వచ్చిందన్నారు. వారి అభ్యున్నతికి ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకుంటుందనివివరించారు. పిఎం ఇజిపి ద్వారా చేతి వృత్తులు,సుస్థిర జీవనోపాధికి సబ్సిడీ రుణాలు మంజూరు చేస్తామన్నారు.అనంతరం కొత్తగా నిర్మిస్తున్న హస్తకళల భవనాల నిర్మాణ సముదాయాన్ని పరిశీలించి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ళి త్వరగా పూర్తి చేయటానికిచర్యలు తీసుకోవాలని పిడిని ఆదేశించారు.ఈ కార్యక్రమాల్లో డిఆర్‌డిఏ తులసి,ఏడి జ్యోతి,మేనేజర్ కేశవులు,ఎపిడిప్రభావతి, డిపిఎం వనజాక్షి, సుబ్బారెడ్డి, ఏరియా కో ఆర్డినేటర్ డాంగే యాదవ్,ఎఎంసి మునెయ్య, సిసి లక్ష్మయ్య,మాధవయ్య, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## దిశ పై అవగాహన కార్యక్రమం



తిరుపతి విద్య, నవంబర్ 17, ప్రభాతవార్త

శ్రీ పద్మావతి మహిళ డిగ్రీ, పిజి కళాశాలలో దిశ పై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డా. కె. మహదేవమ్మ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన డిఎస్‌పి రామరాజు దిశ యాక్ట్ పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దిశ యాప్ ఏ విధంగా పని చేస్తుందో వివరిస్తూ దిశ కాల్ వచ్చిన 5 నిమషాల లోపలే పోలీసు యంత్రాంగం అక్కడకు చేరుకుంటుందని తెలిపారు. ట్రాక్ మై ట్రావెల్ ద్వారా సురక్షితంగా ప్రయాణం చేయ్యవచ్చని వారు వెళ్ళే దారిని పోలీసులు ట్రేస్ చేస్తుంటారని వివరించారు. అంతేగాక ఈవ్ టీజింగ్‌ను, ర్యాగింగ్ పై అవగాహన కల్పించారు.దిశ ఎస్ఐ అరుణ, దిశ సిబ్బంది, శ్రీపద్మావతి కళాశాల స్టూడెంట్స్ కౌన్సిల్ ఇన్చార్జిడా.సి.భువనేశ్వరీ దేవి,డా.సి.డిస్వర్ణలత,డా. ఉషారాణి, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## కరప్షన్ ఫ్రీ ఇండియా కోసం కృషి చేద్దాం-కెవి.రమణ



తిరుపతి ప్రెస్‌క్లబ్,నవంబర్ 17 ప్రభాతవార్త:

లంచగొండితనం లేని భారతదేశం కోసం కృషి చేద్దామని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా,మంగళం శాఖ బ్రాంచ్ మేనేజర్ కెవి.రమణ విద్యార్థులకు పిలుపునిచ్చారు. గురువారం మంగళంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (మంగళం ట్రెం డ్స్) విజిలెన్స్ అవేర్‌నెస్ క్యాంపెయిన్-2022 కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ క్యాంపు ముఖ్య ఉద్దేశ్యం భావితరాలకు కరప్షన్ ఫ్రీ ఇండియాను అందించడమే ప్రధాన ధ్యేయం గా తమ బ్యాంకు ద్వారా విద్యార్థులకు,స్థానిక ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా మన్నా రు.కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు లంచగొండితనం నిర్మూలన అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈకార్యక్రమంలోడిప్యూటీబ్రాంచ్‌హెడ్ రాజ్‌కమల్‌నాయక్, పాఠశాల అసిస్టెంట్ శ్రీధర్,ఉపాధ్యా యులు,బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

## ఎస్జీఎస్ కాలేజీకి న్యాక్ ఎప్లస్ గ్రేడ్ కోసం సమిష్టిగా పనిచేయాలి

టిటిడి జేఈవో సదా భార్గవి



తిరుపతి (విద్య), నవంబర్ 17, ప్రభాతవార్త

ఎస్జీఎస్ కాలేజీకి న్యాక్ ఏ ప్లస్ గ్రేడ్ కోసం సమిష్టిగా పని చేయాలని టిటిడి జేఈవో సదా భార్గవి అధికారులకు ఆదేశించారు. కళాశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను గురువారం ఆమె పరిశీలించారు. కళాశాలలోని తరగతి గదులు, అన్ని విభాగాల ల్యాబులు పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జేఈవో సదాభార్గవి మాట్లాడుతూ ఎస్వీ డబ్ల్యూ, ఎస్వీ ఆర్ట్స్ కళాశాలకు ఇటీవలే న్యాక్ ఏ ప్లస్ గ్రేడ్ లభించిందని చెప్పారు. ఎస్జీఎస్ కళాశ్యాల తొలిసారి న్యాక్ గుర్తింపు కోసం వెళ్తున్న నేపథ్యంలో కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర బృందంతో పాటు టీటీడీలోని అన్ని విభాగాల అధికారులు సిబ్బంది సమన్వయంతో పని చేసి కళాశాలకు న్యాక్ ఏ ప్లస్ గ్రేడ్ గుర్తింపు లభించేలా ఏర్పాటు చేయాలన్నారు. కళాశాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 16 మంది విద్యార్థులకు గోవిందరాజస్వామి వాకర్స్ అసోసియేషన్ ప్రకటించిన నగదు బహుమతులను సదా భార్గవి అందజేసారు. డిఇఓ డాక్టర్ భాస్కర్ రెడ్డి, ఎస్ఐ వెంకటేశ్వర్లు, డిప్యూటీ ఈవో గోవిందరాజన్, డిఎఫ్వో శ్రీనివాస్, ఈఈ మనోహరం, ఐటి జనరల్ మేనేజర్ సందీప్, కళాశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్ రెడ్డి, గోవిందరాజ స్వామి, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రాజకీయవేదికగా మారిన నారదపుష్కరిణి..తెదేపా

శ్రీకాళహస్తి, నవంబర్ 16 ప్రభాతవార్త



దక్షిణకైలాసంగా పేరుగాంచిన వాయులింగేశ్వర క్షేత్రంలో పవిత్రమైన కార్తీక మాసంలో శివనామ్మరణ తో మారు మ్రోగాల్సి న పవిత్రనారదపుష్క రిణిలో మహిళా భక్తుల దీపాలతో దేదీప్యమానంగా వెలగాల్సి న పుష్కరిణిలో శివనామస్మరణకు బదులు రాజకీయ సభలు జరగడం భక్తుల మనోభావాలు దెబ్బతినేలా ఉన్నాయని రాష్ట్ర తెలుగు దేశంపార్టీ కార్యదర్శి రెడ్డివారిగురవారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఈసంద్భంగా ఆయన మాట్లాడుతూ ఒక రాజధాన్ని కట్టేందుకు దిక్కులేని ప్రభుత్వానికి మూడు రాజధానులా? మూడున్నరేళ్ళలో మూడు రాళ్ళన్నా పేర్చారా అని తీవ్రస్థాయిలోవిమర్శించారు. నాడు అమరావతే ఏకైక రాజధాని అన్న నోళ్ళు నేడు వికేంద్రీకరణకు మద్దతు అనడంలో మూడు సంచులు నింపుకునే ప్రయత్నమే అన్నారు. పవిత్ర కోనేరులో ఓంకారనాథాలతో ఉండాల్సి న పుష్కరిణిలో వైకాపా రంగులో ఉన్న బెలూళ్ళను, చుట్టుపక్కల జెండాలను కట్టడం దేవాదాయశాఖ నిబంధనలకు విరుద్ధమన్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయ ఇఓపై చర్యలుతీసుకుని పుణ్యక్షేత్రం పవిత్రతను కాపాడాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్ర బిసి సాధికార కమిటీ సభ్యులు మిన్నల్‌రవి, జిల్లా రైతు నాయకులు కృష్ణమనాయుడు, నియోజకవర్గ టిఎన్‌టియుసి నాయకులు సుబ్రమణ్యం, బిసి నాయకులు మునెయ్య తదితరులు పాల్గొన్నారు.

## శ్రీసిటీలో 'ఎస్ఈబి' సమీక్షా సమావేశం



శ్రీసిటీ నవంబర్ 17, ప్రభాతవార్త

తిరుపతి జిల్లా అదనపు పోలీస్ సూపరింటెండెంట్ (ఏఎస్పీ) ఇ.సుప్రజ అధ్యక్షతన గురువారం శ్రీసిటీలో స్పెషల్ ఎన్‌పోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ, మాదక ద్రవ్యాల అక్రమ రవాణా నియంత్రణ కోసం తీసుకోవల్సిన చర్యలు, మాదక ద్రవ్యాల వినియోగాన్ని అరికట్టడానికి చేపట్టాల్సిన ప్రణాళికలను గురించి వివరించారు. జిల్లా వ్యాప్తంగా మాదక ద్రవ్యాల అక్రమ రవాణాకు సంబందించిన అన్ని మార్గాలను గుర్తించాలని, పోలీస సమాచార వ్యవస్థను బలోపేతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఎస్ఈబీ సమావేశం ఇక్కడ నిర్వహించినందుకు తిరుపతి ఏఎస్పీకి శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డా.రవీంద్ర సన్నారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.అన్ని విదాల మంచి వాతావరణం కలిగి పారిశ్రామికంగా ,విధ్యాపరంగా అభివృద్ధి చెందుతున్న తిరుపతి జిల్లాను మరింత సురక్షితంగా ,ఆరోగ్యంగా ఉంచడంలో ఈ తరహా సమావేశాలు సహాయ పడతాయన్నారు. ఈ సమీక్షా సమావేశంలో తిరుపతి ఎస్ఈబీ ఏఎస్పీ బి.స్వాతి, గూడూరు ఎస్ఈబీ ఏఎస్పీ ఎస్ రవికుమార్, గూడూరు ఎస్ఈబీ డీఎస్పీ జానకీ రామయ్య, తిరుపతి ఎస్ఈబీ డీఎస్పీ ఇ.శ్రీనివాసులు,శ్రీసిటీ డీఎస్పీ జగదీష్ నాయక్ మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## కదిరి పద్మజకు పిహెచ్‌డి



తిరుపతి (విద్య), నవంబర్ 17, ప్రభాతవార్త

ఎస్వీ యూనివర్సిటీ కంప్యూటర్ సైన్స్, ఇంజినీరింగ్ విభాగంలో పరిశోధన చేసిన కదిరి పద్మజకు పిహెచ్‌డి డిగ్రీ లభించింది. ఈమె ప్రొఫెసర్ ఆర్. శేషాద్రి పర్యవేక్షణలో మెషిన్ లెర్నింగ్ టెక్నిక్స్ ఫర్ ప్రెడిక్షన్ ఆఫ్ మిటిగేషన్ టైమ్, అటాక్ డిటెక్షన్ అండ్ సెక్యూరబుల్ డివైస్ ఆథంటిఫికేషన్ ఇన్ క్లౌడ్ ఎన్విరాన్‌మెంట్ అనే అంశం పై పరిశోధన చేసారు.

## రైతులకు డ్రిప్ పరికరాలు అందజేత

.తొట్టంబేడు, నవంబర్ 17 ప్రభాతవార్త



మండలంలోని బోనుపల్లి గ్రామంలో ఉద్యానవనశాఖ మరియు రాష్ట్ర మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో రైతులకు సబ్సిడీలో డ్రిప్ పరికరాలు అందించినట్లు ఉద్యానవన శాఖాధికారిణి పుష్పలత తెలిపారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రంలో రైతులు సబ్సిడీలో డ్రిప్ పరికరాలన్నీరైతు భరోసా కేంద్రం వద్ద పేర్లు నమోదు చేసుకున్న వారికి అందించారు. రైతులకు అవసరమైన పరికరాలు కావాలంటే రైతు భరోసా కేంద్రంలో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మైక్రో ఇరిగేషన్ అధికారిణి గౌరీప్రియ, విఎఎ లక్ష్మణ్, మరియు డీలర్ మునస్వామి, రైతులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ షాపుల టెండర్లకు నేడు ఆఖరి రోజు

-డిపిటిఓ చెంగల్‌రెడ్డి వెల్లడి

తిరుపతి ప్రెస్‌క్లబ్,నవంబర్ 17 ప్రభాతవార్త:

తిరుపతి జిల్లాలోని వివిధ ఆర్టీసీ డిపోలలో ఖాళీగా ఉన్న 96 షాపులను అద్దె ప్రాతిపదికన నిర్వహించుకోవడానికి దరఖాస్తు చేసుకునే ఔత్సాహికులకు నేడు 18వ తేదీ శుక్రవారం ఆఖరి రోజని ఏపిఎస్‌ఆర్టీసీ తిరుపతి జిల్లా ప్రజా రవాణా అధికారి(డిపిటిఓ) తిమ్మాడి చెంగల్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.తిరుపతి సెంట్రల్ బస్‌స్టేషన్‌లో 36 షాపులు,పాకాల 4,పుత్తూరు 3,శ్రీకాళహస్తి 6,సత్యవేడు 2,కోట 9,నాయుడుపేట 15,గూడూరు 4,వెంకటగిరి 6,రంగంపేట 3,చంద్రగిరి 1,నేంద్రగుంట 1,భాకరాపేట బస్‌స్టేషన్‌లో 2తో కలిపి మొత్తం 96 షాపులకు టెండర్లను ఆహ్వానిస్తున్నామన్నారు.దరఖాస్తులు ఆయా డిపో మేనేజర్ కార్యాలయాలలో లభిస్తాయన్నారు.

## దాతల సాయంతో విద్యుత్ దీపాలు ఏర్పాటు

అభినందించిన ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం



నారాయణవనం, నవంబర్ 17 ప్రభాతవార్త :

మండలంలోని నారాయణవనం మెయిన్‌రోడ్డు నుంచి బ్రాహ్మణాతాంగేల్ దళితవాడకు వెళ్లే నడక దారికి దాతలు సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తనయుడు, జడ్పీ ఫైనాన్స్ కమిటీ మెంబర్ కోనేటి సుమన్‌కుమార్, సర్పంచ్ గుణశేఖర్‌ల ఆర్థిక సాయంతో సుమారు కిలో మీటరు దూరం వరకు విద్యుత్ స్తంబాలను ఏర్పాటు చేసి వాటికి బల్బులను గురువారం ఏర్పాటు చేశారు. సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం గురువారం రాత్రి 7గంటలకు స్విచ్ ఆన్ చేసి ప్రారంభించారు. జడ్పీటీసీ, సర ్పంచ్‌లు వారి దాతృత భావంతో సుమారు 2.50లక్షల రూపాయాల సొంత నగదుతో ఏర్పాటు చేయడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పి దివాకర్‌రెడ్డి, మండల వైకాపా కన్వీనర్ ఇ సొరకాయులు, డిసిసిబి డైరెక్టర్ ఊరప్ప, సర్పంచులు మురుగేశం, ధర్మలింగం, అయ్యప్ప శశికళ, సుబ్రమణ్యంరెడ్డి, విద్యుత్‌శాఖ ఏఇఇ ప్రకాష్‌బాబురెడ్డి, ఎల్ఐ ప్రభాకర్, జైభీమ్ ధనంజయులు, నాయకులు పంచాయతీ కార్యదర్శులు కిషోర్, లీలాకుమారి, ఇజిఎస్ ఎపిఓ నాగభూషణ, వెలుగు ఎపిఎం మమత, సిసి నాగేంద్రరావు, ఎస్ఐ పరమేష్‌నాయక్, ఎఎస్ఐ ఆశీర్వాదం, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జగనన్న ఇళ్ల నిర్మాణాలకు మెటీరియల్‌ను సిద్ధం చేసుకోండి



తిరుపతి కార్పొరేషన్, నవంబర్ 17, ప్రభాతవార్త

జగనన్న ఇళ్ళ నిర్మాణాలకు అవసరమైన మెటీరియల్‌ను వర్షాలు రాక మునుపే సిద్ధం చేసుకోవాలని తిరుపతి నగర పాలక సంస్థ కమిషనర్ అనుపమ అంజలి అన్నారు. వడమాలపేట మండలం కల్లూరు వద్ద నిర్మిస్తున్న ఇళ్ళ నిర్మాణాలను గురువారం మధ్యాహ్నం కమిషనర్ అనుపమ అంజలి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డిసెంబర్ చివరి వారంలో మొదటి దశలో ప్రారంభంకానున్న గృహ ప్రవేశాలకు వీలైనన్ని గృహాలను సిద్ధం చేయాలని ఆదేశించారు. గృహ నిర్మాణాలకు అవసరమైన ఇసుక, సిమెంట్, ఇటుకలను నిర్మాణాలు జరుగుతున్న స్థలాలకు దగ్గర్లోకి వర్షాలు రాకమునుపే సిద్ధం చేసుకునేలా చూడాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచనలు జారీ చేసారు. "పేద ప్రజల లబ్ధిదారులకు సకాలంలో సొంత ఇంటిని నిర్మించి ఇవ్వాల్సి న బాధ్యత మనందరిపై వుందనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. కమిషనర్ అనుపమ అంజలి వెంట డిప్యూటీకమిషనర్‌చంద్రమౌళీశ్వర్ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజనీరింగ్ తిరుమాలిక మోహన్, మున్సిపల్ ఇంజనీర్ వెంకట్రామిరెడ్డి, లే అవుట్ ఇన్చార్జి డిఈ రవీంద్ర రెడ్డి, అమ్నెటి సెక్రటరీలు పాల్గొన్నారు.

## క్రీడలు మానసికోల్లాసాన్నిస్తాయి..ఎంఈవో

శ్రీకాళహస్తి, నవంబర్ 17 ప్రభాతవార్త




క్రీడలు ప్రతి ఒక్కరికి మానసికోల్లాసాన్ని ఇస్తాయని, శారీరక దృఢత్వం పెంపొందించాలని అలాగే గెలుపు ఓటములు సరి సమానంగా తీసుకోవాలని ఎంఈవో ఆర్.భువనేశ్వరి తెలిపారు. గురువారం పట్టణంలోని ఆర్పీబిఎస్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో జగనన్న క్రీడా సంబరాలు కోసం నియోజకవర్గ మరియు మండల స్థాయి క్రీడా పోటీలు ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా ఎంఈవో భువనేశ్వరి, జిల్లా క్రీడాధికారి ఉమాశంకర్, ఎస్ఎంసి ఛైర్మన్ ఆర్కాడు శంకర్, హెచ్ఎం రాజేశ్వరిలు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎంఈవో భువనేశ్వరి మాట్లాడుతూ 2022 డిసెంబర్ 21వతేదీ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా నియోజకవర్గ ఓపెన్‌టూ ఆల్ సెలక్షన్స్ కోసం 18 సంవత్సరాలపైబడిన యువతీ యువకులు వాలీబాల్, కబడ్డీ, బ్యాడ్మింటన్, క్రికెట్(మెన్) క్రీడల్లో అత్యున్నత నైపుణ్యం కలిగిన క్రీడాకారులకు నియోజకవర్గ స్థాయిలో ఎంపికలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో పిఈటిలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## మంత్రి రోజాకు జన్మదిన శుభాకాంక్షలు



విజయపురం, నవంబరు 17 ప్రభాతవార్త :

రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్.కె.రోజాకు విజయపురం మండలానికి చెందిన వైఎస్సాఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు గురువారం జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. జన్మదినం సందర్భంగా ఆమెను కలిసి వైస్ ఎంపిపి బాలాజీ, సింగిల్ విండో అధ్యక్షుడు హరిబాబునాయుడు, నాయకులు సతీష్‌యాదవ్, శివరాజు, గుణశేఖర్ రెడ్డి, కుమార్, హరికృష్ణ, మనోహర్‌రెడ్డి, గోపిరాజు, కృష్ణయ్య తదితరులు శుభాకాంక్షలు తెలిపారు

## అన్నదానికి విరాళం



శ్రీకాళహస్తి, నవంబర్ 17 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించే నిత్యాన్నదాన పథకానికి గురువారం గుంటూరు వాస్తవ్యులు రంగావరులు.భుజంగరావు మరి యు విజయలక్ష్మి కుటుంబసభ్యులు రూ.50వేలు శ్రీకాళహస్తీశ్వ రాలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ అంజూరుతారకశ్రీనివాసులకు వితరణగా అందించారు. ఈసందర్భంగా దాతలకు స్వామిఅమ్మవార్ల ప్రత్యేకదర్శనం చేయించి తీర్థప్రసాదాలను అందించారు. కార్యక్రమంలో అన్నదాన విరాళ కౌంటర్ ఇన్‌ఛార్జి సుబ్రమణ్యం మరియు చరణ్ తదితరులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబానికి అండగా ఎంఎల్‌ఏ చెవిరెడ్డి



చంద్రగిరి, నవంబర్ 17 ప్రభాతవార్త:

రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడిన దంపతుల కుటుంబానికి అన్నివిధాలుగా అండగా వుంటానని ఎంఎల్ఏ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి అన్నారు. పనపాకం పంచాయతీ, తూర్పుపల్లికి చెందిన సుబ్రమణ్యం, నాగమణి దంపతులు బుధవారం రాత్రి మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న చెవిరెడ్డి వెంటనే మానవతాధృ కృధంతో స్పందించారు. మృతుల కుమారుడు గిరి వాలంటీర్‌గా పనిచేస్తున్నాడు. తల్లిదండ్రులను కోల్పోయి దిక్కుతోచని స్థితిలో కన్నీటి పర్యంతమవుతున్న గిరిని ఆదుకోవాలని, అండగా నిలవాలని పార్టీ (దక్షిణ మండల) డివిజన్ అధ్యక్షుడు అగరాల దేవారెడ్డిని ఆదేశించారు. ఈ నేపథ్యంలో పనపాకం సచివాలయ సిబ్బందితో కలసి దేవారెడ్డి రూ.30 వేలు గిరికి ఆర్థిక సాయం అందించారు. ఎంఎల్ఏ సహకారంతో ప్రభుత్వం నుండి ఆర్థిక సహాయం లభించే విధంగా చూస్తామని దేవారెడ్డి బాధితుడికి హామీ ఇచ్చారు.

# కుక్క కాటుకు విద్యార్థి మృతి

కేవీబీ పురం, నవంబరు 17 ప్రభాతవార్త:

కేవీబీ పురం మండలం లోని వగత్తూరు ఎస్టీ కాలనీకి చెందిన గంధం చెంచ య్య, రత్నమ్మ కుమారుడు చందు(7వ తరగతి) మృతి చెందడంతో ఒక్కసారిగా గ్రామం మూగబోయింది. వివరాలు ఇలా.... రేణిగుంటలోని విమానాశ్రయ సమీపం డివిజన్ ఇన్‌చార్జిలో ఉన్న ట్రైబల్ వెల్ఫేర్ స్కూలులో 7వ తరగతి చదువుతున్నాడు చందు. కొన్ని రోజుల ముందు కుక్క కరవడంతో సరైన వైద్యం అందించకపోవడం వలన గురువారం మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న ఎంపీపీ రాయదుర్గం మునిలక్ష్మి నందకుమార్, సర్పంచ్ కాటమ్మ గోపాల్, ఏపీ మోడల్ స్కూలు చైర్మన్ అగ్రహారం హరిబాబురెడ్డి, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు గౌనిపురం రాముర్మ తదితరులు చందు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబానికి అన్ని విధాలా ఆదుకుంటామని వారు తల్లిదండ్రులకు భరోసా కల్పించారు. అలాగే తిరుపతి జిల్లా సీపీఎం సత్యవేడు డివిజన్ ఇన్‌చార్జి దాసరి జనార్దన్, సీపీఎం మండల కార్యదర్శి నాగరాజులు మాట్లాడుతూ బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్‌చేశారు.

## మండల కార్యాలయ సబార్డినేట్ మృతి

కుప్పంరూరల్ నవంబర్ 17 ప్రభాతవార్త :

కుప్పం మండలపరిషత్ కార్యాలయంలో ఆఫీసు సబార్డినేట్‌గా పనిచేస్తున్న తిరుపతి గురువారం మృతి చెందారు.ఈయన గత కొంత కాలంగా అనారోగ్యంతో భాద పడుతుండేవాడు గురువారం ఆయన స్వగ్రామ మైన ఆవులనత్తంలో మృతిచెందారు.ఆతని మృతి పట్ల ఎంపీపీ అశ్వనిమురుగేష్,జెడ్పిటీసీ ఎడిఎస్ శరవణ, మండల కన్వీనర్ హెచ్ఎం మురుగేష్,ఎంపీడీఓ జానకమ్మ,ఈఓపీఆర్‌డి విజయ్‌దత్, మండల పరిషత్ సిబ్బంది బాలకృష్ణ, వినయ్,చంద్ర, కార్యదర్శులు ప్రగాడ సంతాపం వ్యక్తం చేసారు.

## తల్లీబిడ్డ అదృశ్యం

పుంగనూరు, నవంబరు 17 ప్రభాతవార్త :



మండలంలోని ఆరడిగుంటపంచాయతీ అలజనేరుకు చెందిన ఆనంద భార్య మమత,వారి ఏడాదిలోపు వయసుగల కుమార్తెతో పాటూ కనుపించడంలేదని భర్త ఆనంద పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈనెల 15న పట్టణానికి వచ్చిన వారిద్దరూ తిరిగిరాలేదని తన భార్యాబిడ్డ ఆచూకి తెలియ చేయాలని ఆనంద ఫిర్యాదులో పేర్కొనారని ఎస్ఐ మోహన్‌కుమార్ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

## గ్రంధాలయ వారోత్సవాలలో "వ్యాస రచన" పోటీలు



చంద్రగిరి, నవంబర్ 17 ప్రభాతవార్త:

గ్రంధాలయ వారోత్స వాలను పురస్కరించుకుని గురువారం గ్రంధాలయ అధికారి రెడ్డెమ్మ బాలుర, బాలికల పాఠశాలల విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ గ్రంధాలయంలో సభ్యత్వం తీసుకుని పుస్తక పఠనం వాడుక చేసుకోవాలన్నారు. విద్యార్థులు కళాశాల, పాఠశాల, పంచాయతీలలోని గ్రంధాలయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విద్యార్థులతో కలసి ర్యాలీ నిర్వహించారు. ఈ క్యాక్రమంలో హెచ్ఎంలు వెంకట నారాయణ చౌదరి, కోదండ నాయుడు, టీచర్లు, రమాదేవి, పాల్గొన్నారు.

# ఈర్ష్యాద్వేషాలు వదిలివేస్తేనే సంతోషంగా ఉంటారు

## -ఆర్ఆర్‌బి సభ్యురాలిగా రేవతి ఎంపిక సంతోషం -మాజీ ఎంఎల్ఏ ఎస్వీనాయుడు



తొట్టంబేడు, నవంబర్ 17 ప్రభాతవార్త : టెక్నాలజీ రంగంలో రాణించి ప్రపంచదేశాల వరుసలో భారతదేశ ప్రతిష్టను ఇనుమడింపచేసి భారతదేశం నుంచి ప్రపంచ దేశాల్లో గుర్తింపు పొందుతూ భారత దేశానికి వన్నెతెచ్చిన మన్నేపల్లి రేవతి టెలికమ్యూనికేషన్స్ రంగంలో రేడియో రెగ్యులేటరీ సభ్యురాలిగా (ఆర్ఆర్‌బి) ఎంపికవడం ఎంతోసంతోషమని మాజీ ఎంఎల్ఏ ఎస్సీవీనాయుడు అన్నారు. గురువారం చిన్నకనపర్తి గ్రామానికి విచ్చేసిన ఆమెకు కుటుంబసభ్యులు, గ్రామస్తులు ఆత్మీయ అభినందన సభను నిర్వహించారు. కార్యక్రమానికి మాజీ ఎంఎల్ఏ ఎస్సీవీనాయుడు, తెలుగుదేశంపార్టీ మండల అధ్యక్షుడు గాలిమురళీనాయుడు, మాజీ ట్రస్టుబోర్డు సభ్యులు నారాయణయాదవ్, గోగినేని భాస్కర్ నాయుడులు విచ్చేశారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన అభినందన సభలో ముందుగా ప్రపంచ దేశాలల్లోని భారతదేశంలో టెలికమ్యూనికేషన్ రంగంలో గెలిచి నిలచిన తొలి మహిళ రేవతి దంపతులను మాజీ ఎంఎల్ఏ దుశ్శాలువతో సత్కరించి పుష్పగుచ్ఛాన్ని అందించి అభినందించారు. అనంతరం కేక్‌కట్‌చేశారు. ఈసందర్భంగా మాజీ ఎంఎల్ఏ ఎస్సీవీనాయుడు మాట్లాడుతూ పూర్వజన్మలో చేసుకున్న పుణ్యఫలమే ప్రపంచదేశాల్లో టెలికమ్యూనికేషన్ సభ్యురాలిగా ఉండే అవకాశం రావడం జరుగుతుందన్నారు. వీటన్నింటిని దర్శిని అంటారని తెలివి అనేది దైవానుగ్రహం అన్నారు. తాను రాజకీయంలో ఎంతో మంది ఎంఎల్ఏలను ఎంతోమందిని చేశానని తాను ఎంఎల్ఏను అయ్యాయని 1977 నుంచి 47 సంవత్సరాలుగా వేలమంది లీడర్లు, నాయకులను తయారు చేశానన్నారు. మనం సంతోషపడుతూ ఇతరులను సంతోషపెట్టాలన్నారు. ఢిల్లీ నుంచి ప్రపంచదేశాల నుంచి రేవతి ఎంపికకావడం ఎంతో అభినందనీయం అన్నారు. తెలుగుదేశంపార్టీ మండల అధ్యక్షుడు గాలిమురళీ నాయుడు మాట్లాడుతూ తొట్టంబేడు మండల ప్రతిష్టను ఇనుమడింపచేసిన ఘనత ఒక్క రేవతికే దక్కిందన్నారు. సన్మాన గ్రహీత రేవతి మాట్లాడుతూ ప్రధానమంత్రి, కేంద్రమంత్రులు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు ఎంతో శ్రమించారని రెండు నెలలుగా తాను పడ్డ కష్టానికి ఫలితం దక్కిందన్నారు. తనకు ఉద్యోగ నిర్వహణలో ఎంతో సహకరిస్తున్న తన భర్త మహేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంఎల్ఏ ఎస్సీవీ నాయుడు, మండల తెలుగుదేశంపార్టీ అధ్యక్షుడు గాలిమురళీనాయుడు, వైకాపా నాయకులు గోగినేని భాస్కర్‌నాయుడు, చిర్రినాయుడు, నరేంద్ర, రమాదేవి, సురేష్‌నాయుడు, మణినాయుడు, పలువురు కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

# జాతీయ విద్యావిధానం సృజనాత్మక సామర్థ్యాల పెంపుపై దృష్టి

## - ద్రవిడ వర్సిటీ విసి ఆచార్య రామకృష్ణ



కుప్పం, నవంబర్ 17 ప్రభాతవార్త : జాతీయ విద్యావిధానం ప్రతి వ్యక్తిలోని సృజనాత్మక సామర్థ్యాల పెంపుపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరిస్తుందని ద్రవిడ వర్సిటీ ఉపకులపతి ఆచార్య తుమ్మల రామకృష్ణ పేర్కొన్నారు. గురువారం వర్సిటీలో జాతీయ విద్యావిధానం సెల్ సమన్వయ కర్త ఆచార్య శ్రీనివాస్ కుమార్, కుప్పం మిస్టర్ పర్ఫెక్ట్ షోరూంల సహకారంతో జాతీయ విద్యా విధానం అమలుద్వారా ఉపాధి కల్పన అనే అంశంపై జరిగిన జాతీయ సదస్సులో విసి ప్రసంగించారు. విద్య గ్రహణ సామర్థ్యాలను, అక్షరాస్యతకు, సంఖ్యాశాస్త్రానికి సంబంధించిన పునాది సామర్థ్యాలను ఆలోచించడం, సమస్యలు పరిష్కరించడం వంటివే కాక సామాజిక, నైతిక, భావోద్వేగపూరితమైన మనోవైఖరులను పెంపొందించే సూత్రంపై ఆధారపడిందన్నారు. రెక్టార్ ఆచార్య అనురాధ మాట్లాడుతూ విద్యలో సాంకేతిక పరిజ్ఞానమనేది ఒక ప్రయాణమే తప్ప గమ్యస్థానం కాదన్నారు. రిజిస్ట్రార్ డా॥ వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నూతన విద్యావిధానంను సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నారన్నారు. కర్ణాటక సెంట్రల్ వర్సిటీ ప్రొఫెసర్ డా॥ లింగమూర్తి, పిఒ ఆచార్య కేశవమూర్తి, మిస్టర్ పర్ఫెక్ట్స్ అధినేత ఆనంద్, పిఆర్వో దుర్గా ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## స్వర్ణపతకం కైవసం చేసుకున్న కేశవరెడ్డి విద్యార్థులు




తిరుపతి (విద్య), నవంబర్ 17 ప్రభాతవార్త : కేరళ కోజి కోడ్‌లోని వీకె కృష్ణమీనన్ ఇండోర్ స్టేడియంలో జరిగిన 11వ జూనియర్ నేషనల్ టాంగ్ ఇల్ మూడు చాంపియన్ షిప్ పోటీల్లో కేశవరెడ్డి స్కూలు, ఎం.ఆర్‌పల్లి తిరుపతి విద్యార్థులు పాల్గొని 2 స్వర్ణపతకాలు, 2 వెండి పతకాలు, 3కాంస్య పతకాలు సాధించి విజయ దుందుభి మ్రోగించారు. విద్యార్థులను కేశవరెడ్డి విద్యా సంస్థల చైర్మన్ ఎన్. కేశవరెడ్డి అభినందించారు.

## మంజూరైన ఇళ్ళ నిర్మాణాలు సత్వరం ప్రారంభం : జాయింట్ కలెక్టర్

చిత్తూరు, నవంబర్ 17 ప్రభాతవార్త:జిల్లాలో కొత్తగా మంజూరు చేసిన 31 కాలనీల్లో ఇళ్ళ నిర్మాణాలను సత్వరం ప్రారంభించాలని జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్ గురువారం హౌసింగ్ డిఇలతో సమావేశమై ఇళ్ళ నిర్మాణాల ప్రగతిని సమీక్షించారు. ఈ సమావేశంలో జెసి వెంకటేశ్వర్ మాట్లాడుతూ కొత్తగా మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన స్థలాలను సత్వరం గుర్తించి ఇళ్ళ నిర్మాణాలు ప్రారంభించాలన్నారు. ఎవరైనా మంజూరైన ఇళ్ళు వద్దనుకుంటే వారి వివరాలను సత్వరం పంపి వారి పేర్లను జాబితా నుండి తొలగింపుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇళ్ళ నిర్మాణాల పనులు సత్వరం ప్రారంభించి వేగంగా పూర్తి చేయడానికి ఉపక్రమించాలన్నారు. ఇళ్ళు మంజూరైన లబ్ధిదారులు ఇళ్ళకు యాజమానులు కావాలనుకుంటే సత్వరం నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో జెసి వెంకటేశ్వర్‌తో పాటు హౌసింగ్ పిడి పద్మనాభం తదితరులు పాల్గొన్నారు.

## 24న తిరుపతిలో హక్కుల సాధన కోసం దళితుల సమరభేరి



చిత్తూరు, నవంబర్ 17 ప్రభాతవార్త: పోయిన దళితుల హక్కులను తిరిగి రాబట్టుకోవడం కోసం ఈ నెల 24న తిరుపతిలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే దళితుల సమరభేరి కార్యక్రమంను విజయవంతం చేయాలని చిత్తూరు జిల్లా దేశం ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, కార్యాలయ కార్యదర్శి మోహన్‌రాజ్‌లు పిలుపునిచ్చారు. జిల్లా పార్టీ కార్యాలయంలో గురువారం వీరు మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం దళితులపై దాడులు చేస్తోందని, పోయిన దళిత హక్కులను తిరిగి రాబట్టుకోవడానికి ప్రతి దళితుడు సమభేరి మోగించాలన్నారు. ప్రస్తుత ప్రభుత్వం దళితులకు సంబంధించిన 27 పథకాలను రద్దు చేసిందన్నారు. ప్రభుత్వం దళితులను విద్య, ఉపాధికి దూరం చేయడానికి ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి కృష్ణమూర్తి, చిత్తూరు నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు రాజా, తవణంపల్లి బిసి సెల్ అధ్యక్షుడు వినాయక, పూతలపట్టు బీసీ సెల్ అధ్యక్షుడు ధరణీప్రకాష్, కార్పొరేటర్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మాజీ మేయర్ అనురాధ, మోహన్‌ల వర్ధంతి



చిత్తూరు, నవంబర్ 17 ప్రభాతవార్త: చిత్తూరు నగర పరిధిలో గురువారం మాజీ మేయర్ కఠారి అనురాధ, ఆమె భర్త కఠారి మోహన్‌ల 7వ వర్ధంతి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. మాజీ మేయర్ కఠారి అనురాధ, ఆమె భర్త కఠారి మోహన్‌ల వర్ధంతి పురస్కరించుకొని మాజీ మేయర్ కఠారి హేమలత, ఆమె కుటుంబ సభ్యులు గంగనపల్లిలోని వారి సమాధుల వద్ద ఉదయం పూజలు నిర్వహించారు. అనంతరం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయం, చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయాల ఆవరణలోని వారి విగ్రహాలకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. నగర పరిధిలోని సాంబయ్య కండ్రిగ, మురకంబట్టు, గాంధీరోడ్డు, కొంగారెడ్డిపల్లి అన్నక్యాంటీన్, గాంధీ విగ్రహం ప్రాంతాల్లో నిర్వహించిన అన్నదాన కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ బిఎన్.రాజసింహులు, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, మాజీ మేయర్ కఠారి హేమలతలు పాల్గొని నిరుపేదలకు అన్నదానం చేశారు. లెప్రసీకాలనీలోని మహిళలకు బెడ్‌షీట్లు, బట్టలు, భోజనం ప్యాకెట్లను మాజీ మేయర్ కఠారి హేమలత అందజేశారు. చిత్తూరు గాంధీ విగ్రహం సర్కిల్ వద్ద క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు.దేశం నాయకులు మోహన్‌రాజ్, మాజీ డిప్యూటీ మేయర్ సుబ్రమణ్యం, మాజీ కార్పొరేటర్ కందా, తెలుగుదేశం నాయకులు, మాజీ కౌన్సిలర్లు, మాజీ కార్పొరేటర్లు, తెలుగుదేశం కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేడు టిటిడి పరిపాలన భవనం ప్రాంగణంలోసామూహిక దీపోత్సవం

తిరుమల,నవంబర్ 17ప్రభాతవార్తప్రతినిధి: పవిత్రమైన కార్తీకమాసంలో టిటిడి సామూహిక కార్తీకదీపోత్సవాలు నిర్వహించడంలో భాగంగా నేటి సాయంత్రం తిరుపతిలోని పరిపాలన భవనంలో ఏర్పాట్లు చేపట్టింది. ఇప్పటికే ఇందుకు అవసరమైన పాసులు, మహిళల అనుమతి, దీపాలు తదితర సదూపాయాలు సిద్ధం చేసింది. కెటిరోడ్డులోని పరిపాలన భవనం ప్రాంగణం మైదానంలో 1800మంది భక్తులు కూర్చునేందుకు వీలుగా దీపోత్సవానికి విచ్చేసే మహిళలకు తులసి మొక్కలు అందించనున్నారు. అలాగే అష్టలక్ష్మీవైభవం నృత్యరూపకం, సామూహిక లక్ష్మీనీరాజనం(దీపాలు వెలిగించడం), నక్షత్రహారతి, మంగళహారతి నిర్వహించనున్నారు. ఇంజనీరింగ్ విభాగం స్టేజీ, బారికేడ్లు, పుష్పాలంకరణలు, విద్యుత్ సౌకర్యం తదితర వాటిని చక్కగా చేపట్టారు.

## యాత్రికులకు మరింత సురక్షిత సేవలు

తిరుమల, నవంబర్ 17ప్రభాతవార్తప్రతినిధి: పుణ్యక్షేత్రం తిరుమలకు నిత్యం విచ్చేస్తున్న లక్షమంది భక్తులకు ఘాట్‌లో సురక్షిత ప్రయాణం కల్పించే బాధ్యత ఆర్టీసి డ్రైవర్లపై ఉందని, అందుకు తగ్గట్లు బస్సులను మంచి కండీషన్‌లో ఉండేలా, కెఎంపిఎల్ పెంపు, ప్రమాదాల నివారణ లక్ష్యంగా పనిచేస్తామని తిరుమల డిపో ఆర్టీసి సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. గతనెలలో ముగిసిన వెంకన్న బ్రహ్మోత్సవాల్లో తొమ్మిదిరోజులు అశేషభక్తులను తిరుమల-తిరుపతి మధ్య ఘాట్‌లో సురక్షితంగా తరలించి, ప్రయాణీకుల సౌకర్యంగా బస్సులు నడపడంలో తిరుమల డిపో సిబ్బంది పనితీరు అభినందనీయమని తిరుపతి రీజియన్ ఆర్టీసి ఆర్ఎం టి.చెంగల్‌రెడ్డి తెలిపారు. గురువారం తిరుమలకుచేరుకున్న ఆర్ఎం తిరుమల డిపోలో మేనేజర్ విశ్వనాథం, అసిస్టెంట్ ఇంజనీర్ శేఖర్, అసిస్టెంట్ మేనేజర్ (మెటీరియల్) చంద్రయ్య, ఆర్టీసి డ్రైవర్లు,కండక్టర్లు,గ్యారేజీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఎం చెంగల్‌రెడ్డి మాట్లాడుతూ శ్రీవారి బ్రహ్మోత్సవాలలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భక్తులకు సౌకర్యవంతంగా బస్సులను నడిపి విజయవంతం చేయడంపట్ల సిబ్బంది పనితీరును ప్రత్యేకంగా అభినందించారు. గ్యారేజీ సిబ్బంది, డ్రైవర్లతో బస్సులను ఎప్పటికప్పుడు పరీక్షించి, మంచి కండీషన్‌లో బస్సులు ఉండేలా చూడాలన్నారు. కార్గో పై విస్తృత ప్రచారం చేసి ఆదాయం తీసుకురావాలని సూచించారు.

## వైద్యం కోసం వస్తూ గుండెపోటుతో వ్యక్తి మృతి!

చంద్రగిరి, నవంబర్ 17 ప్రభాతవార్త: వైద్యం చేయించుకుని సొంతూరుకు వెళుతున్న వ్యక్తి గుండెపోటుకు గురై మృతి చెందిన విచాకర దుర్ఘటన గురువారం ఏరియా ఆసుపత్రిలో వెలుగు చూసింది. కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. పులిచెర్ల మండలం, కల్లూరుకు చెందిన మహ్మద్ రఫీ (47) గుండె జబ్బుతో బాధపడుతున్నాడు. వైద్యం కోసం భార్య గులాబ్ జాన్‌తో కలసి తిరుపతి స్విమ్స్‌కు చేరుకుని వైద్య చికిత్సల అనంతరం ఆర్టీసి బస్సులో తిరుగు ప్రయాణమయ్యారు. తిరుపతి నుండి కాలూరు వద్దకు చేరుకునే క్రమంలో మహ్మద్ రఫీ గుండెపోటుకు గురై మృతి చెందాడు.

# ప్రజల పట్ల ప్రభుత్వానికి ఉన్న కమిట్మెంట్‌ను చాటుకున్న జగన్:ఎమ్మెల్యే



తిరుపతి కార్పొరేషన్, నవంబర్ 17, ప్రభాతవార్త : ప్రజల పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న కమిట్మెంట్‌ను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మరోసారి చాటుకున్నారని, రాష్ట్ర సచివాలయ వ్యవస్థలోనే మొట్టమొదటి సారిగా కారుణ్య నియామకం కింద ఉద్యోగ అవకాశం దక్కించుకున్న వసంత భాయ్ ఉదంతమే ఇందుకు నిదర్శనమని తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి అన్నారు. ప్రతిపక్ష నేత చంద్రబాబు ప్రాతినిథ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గం, రామకుప్పం ప్రాంతానికి చెందిన మోహన్ నాయక్ భూమన కరుణాకర రెడ్డి నియోజకవర్గం తిరుపతి జీవకోన సచివాలయంలో ఎడ్యుకేషన్ సెక్రటరీగా విధులు నిర్వర్తిస్తూ ఇటీవల మృతి చెందారు. ఊరుకాని ఊరులో తన భర్తను పోగొట్టుకోవడంతో కుటుంబ పోషణ భారంగా మారింది. దిక్కుతోచని స్థితిలో ఇబ్బంది పడుతున్న తరుణంలో జీవకోనలోని తన ఇంటి వద్దకే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్న తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి రావడంతో తన కష్టాన్ని వివరించారు. చలించిన భూమన వెంటనే స్పందించి అనంతపురం రీజియన్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి, వసంతా భాయ్‌కి ఉద్యోగం వచ్చేలా చర్యలు చేపట్టారు. మరో వైపు ఇందుకు సంబంధించిన ఫైళ్లను సిద్ధం చేయాల్సిందిగా తిరుపతి నగరపాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ అనుపమ అంజలికి ఎమ్మెల్యే సూచించారు. ఈ ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయడంతో వసంతాభాయ్‌కి జీవకోన సచివాలయంలోనే అడ్మిన్ ఉద్యోగం దక్కింది. తిరుపతిలో గురువారం మీడియా ప్రతినిధులతో ఆమె మాట్లాడుతూ తనకు స్వాంతన చేకూర్చిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటానని తెలిపారు. అదే విధంగా నగర మేయర్ శిరీష, కమిషనర్ అనుపమ అంజలికి వసంత భాయ్ కృతజ్ఞతలు తెలిపారు.

## మొదటి దశ గృహ ప్రవేశాలకు సిద్ధం చేయండి : కమిషనర్



తిరుపతి కార్పొరేషన్, నవంబర్ 17 ప్రభాతవార్త : తిరుపతి అర్బన్ పరిధిలోని అర్హులైన పేద ప్రజలకు ఐదు జగనన్న లే అవుట్లలో ఇళ్ళు నిర్మించి ఇస్తున్న ప్రక్రియలో భాగంగా మొదటి దశ గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలని తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అనుపమ అంజలి ఆదేశాలు జారీ చేసారు. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో గురువారం మున్సిపల్ ఇంజనీర్లు, హౌసింగ్ అధికారులు, ఇళ్ల నిర్మిస్తున్న కాంట్రాక్టర్లతో కమిషనర్ అనుపమ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ అనుపమ మాట్లాడుతూ డిసెంబర్‌లో రాష్ట్ర వ్యాప్తంగా జగనన్న ఇళ్ళ స్థలాల్లో గృహ ప్రవేశాలకు మొదటి దశ ప్రక్రియలో సిద్ధం చేయాలనే ఆదేశాల ప్రకారం మన ఐదు లే అవుట్లలో వీలైనంత వరకు గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలన్నారు. తిరుపతి అర్బన్ పరిధిలోని అర్హులైన ప్రజలకు చంద్రగిరి మండలం ఎం. కొత్తపల్లి, రేణిగుంట మండలం జి పాలెం, ఏర్పేడు మండలం చిందేపల్లి, వడమాలపేట మండలం కల్లూరు, సూరప్పకసం లే అవుట్‌లో ప్రాంతాల్లో ఇళ్ళ స్థలాలు కేటాయించడం జరిగిందని వివరిస్తూ, ఈ ఐదు లే అవుట్‌లలో గృహ నిర్మాణాలకు ముందుకు వచ్చిన లబ్ధిదారులకు మొదటి దశ నిర్మాణాలు చేపట్టడం జరిగిందని, డిసెంబర్ చివర్లో గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలని కమిషనర్ అనుపమ అన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజనీర్ మోహన్, మున్సిపల్ ఇంజనీర్లు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, డీఈలు విజయ్ కుమార్ రెడ్డి, రవీంద్రరెడ్డి, సంజాయ్ కుమార్, గోమతి, దేవి, మహేష్, హౌసింగ్ డిఈ, ఏఈలు, మెప్మావెంకటరమణ, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

# అట్టహాసంగా మంత్రి రోజాకు జన్మదినోత్సవం







పుత్తూరురూరల్, నవంబరు 17 ప్రభాతవార్త: పుత్తూరు మండల పరిధిలోని పరమేశ్వరమంగళం సమీపంలోని జీవీఆర్ కన్వెన్షన్ మంత్రి రోజా, సెల్వమణిని, వైసీపీ నాయకులు కలసి దుశ్శాలువతో సన్మానించి పూలబొకే అందజేసి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్ జయప్రకాష్ అడ్వకేట్ రవీంద్ర, కె.టి.ప్రసాద్‌రెడ్డి, పుత్తూరు మార్కెటింగ్ కమిటీ చైర్మన్ భాస్కర్‌యాదవ్, ఎంపీపీ మునివేలు, నేసనూరు సర్పంచ్ గోవిందస్వామిరెడ్డి, వైసీపీ సోషల్ మీడియా ఆర్గనైజర్ కె.సుబ్రహ్మణ్యం, మండల కో-ఆప్షన్ సభ్యుడు రామ్‌బత్తయ్య, అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఏ.వడివేలు, రామకృష్ణాపురం, సర్పంచ్ ఎస్.విరిత, రామసముద్రం, సర్పంచ్ డి.కుమార్, శిరుగురాజుపాళెం సర్పంచ్ మురళి, కృష్ణసముద్రం సర్పంచ్ దయ, పీఆర్ మంగళం సర్పంచ్ మల్లికా, తిరుమలకుప్పం సర్పంచ్ సరస, నాయకులు దేవేంద్రరెడ్డి, నరసింహులు, బుజ్జి, రాజా, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

## వికృతమాల ఆలయాన్ని దర్శించుకున్న నారాయణి అమ్మవారు



తిరుపతి ప్రెస్‌క్లబ్,నవంబర్ 17 ప్రభాతవార్త: రేణిగుంట సమీపంలోని వికృతమాల శ్రీ సంతాన సంపద వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని వేలూరు గోల్డెన్ టెంపుల్ పీఠాధిపతి శ్రీ నారాయణి అమ్మవారు గురువారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ ధర్మకర్త డా॥పసుపులేటి హరిప్రసాద్,ఆయన సోదరులు పసుపులేటి శివప్రసాద్, పసుపులేటి వెంకటేశ్వరప్రసాద్ మరియు కుటుంబ సభ్యులు ఘన స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్టు సభ్యులు,వికృతమాల గ్రామ సర్పంచ్,ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## సైన్స్ కాలేజీలో మాస్ కాపీయింగ్

### పరీక్షల్లో పర్యవేక్షణ ఎక్కడ




తిరుపతి (విద్య), నవంబర్ 17 ప్రభాతవార్త : శ్రీ వెంకటేశ్వర విశ్వ విద్యాలయంలోని సైన్స్ కళాశాలలో గత రెండు రోజులుగా ఎంసీఏ సెకండ్ సెమిస్టర్ పరీక్షలు జరుగుతున్నాయి. ఈ పరీక్షల్లో విశ్వవిద్యాలయం పరిధిలోని ప్రైవేట్ కళాశాల విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. మూడు రోజులుగా పరీక్షలు జరుగుతున్నపరీక్షలను పర్యవేక్షించే ఉన్నతాధికారులు పర్యవేక్షించకపోవడం శోచనీయం. దీంతో విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్న గదులలో తక్కువ మంది పర్యవేక్షకులు వేయడం ద్వారా విద్యార్థులకు మాస్ కాపీయింగ్ పాల్పడుతున్నారు. దీనిపై విద్యార్థి సంఘాలు, విద్యార్థులు శుక్రవారం పెద్ద ఎత్తున ధర్నా చేస్తామని హెచ్చరించారు. అధికారుల పని ఒత్తిడి వలన పర్యవేక్షణ కొరవడిందని విద్యార్థి సంఘాల ఆరోపిస్తున్నాయి. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి వెంటనే తగిన చర్యలు తీసుకుని సమస్యను పరిష్కరించాలని విద్యార్థులు కోరుతున్నారు.

# డిబిఆర్ హాస్పిటల్‌లో అడ్వాన్స్‌డ్ లివర్ క్లినిక్ ప్రారంభం

## -గ్లెనిగల్స్ గ్లోబల్ హాస్పిటల్‌తో ఒప్పందం -ఎండి డాక్టర్ గోపికృష్ణారెడ్డి



తిరుపతినగరం, నవంబర్ 17 ప్రభాతవార్త : గ్లెనిగల్స్ గ్లోబల్ హెల్త్ సిటీ చెన్నై ఆధ్వర్యంలో డిబిఆర్ అండ్ ఎస్కె సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సహకారంతో అడ్వాన్స్ లివర్‌క్లినిక్‌ను ప్రారంభించనున్నట్లు డిబిఆర్ అండ్ ఎస్కె హాస్పిటల్ ఎండి డాక్టర్ గోపికృష్ణారెడ్డి తెలిపారు. స్థానిక డిబిఆర్ హాస్పిటల్‌లో గురువారం జరిగిన కార్యక్రమంలో చెన్నై గ్లెనిగల్స్ గ్లోబల్ ప్రముఖ లివర్ సంస్థ డాక్టర్ రజనీకాంత్ పచ్చా మాట్లాడుతూ దేశంలోనే లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ లివర్, ప్యాంక్రియాస్‌కు సంబందించిన వ్యాధులకు అత్యంత ఆదరణ కలిగిన గ్లెనిగల్స్ గ్లోబల్ హెల్త్‌సిటీ వైద్యసేవలను తిరుపతి జిల్లా వాసులకు అందించాలని సదుద్దేశ్యంతో అధునాతనమైన సూపర్‌స్పెషాలిటీ లివర్‌క్లినిక్‌ను డిబిఆర్ అండ్ ఎస్కె హాస్పిటల్ ఎండి డాక్టర్ గోపికృష్ణారెడ్డి సౌజన్యంతో ప్రారంభించామన్నారు. దేశంలో లివర్‌బారిన పడు తున్న రోగుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోందని గణాంకాల ప్రకారం ప్రతి ఏటా దాదాపు 10లక్షలకు పైగా లివర్‌కు సంబంధించిన వ్యాధిగ్రస్తులు బాధపడుతున్నారన్నారు. ఈ వ్యాధిపైన అవగా హన తీసుకురావడం, అలాగే వ్యాధి బారిన పడిన వారికి ఆరోగ్య సలహాలు, సూచనలు ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ఇతర దేశాల్లో రూ.1.50కోటి అయ్యేఖర్చు ఈ కాలేయ మార్పిడిని కేవలం రూ.20 లక్షలతో గ్లోబల్ ఆస్పత్రి అందుబాటులో తీసుకొచ్చిందన్నారు. పెద్దవారికే కాకుండా పిల్లలకు సైతం ఎంతో క్లిష్టమైన కాలేయ మార్పిడిని విజయవంతంగా నిర్వహించామని ఇప్పుడు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉన్నారన్నారు. ఆస్పత్రి ఎండి గోపికృ ష్ణారెడ్డి, ఈడి డాక్టర్ మధుకృష్ణారెడ్డిలు మాట్లాడుతూ తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో కాలేయ సమస్యతో బాధపడే వారు అధికంగా ఉన్నారని వారికి మెరుగైన సేవలు అందించేందుకు డిబిఆర్ ఆస్పత్రి గ్లోబల్ ఆస్పత్రితో ఒప్పందం కుదుర్చుకుందన్నారు. లివర్ విభాగంలోనే అత్యంత ప్రాచు ర్యం పొందిన గ్లెనిగల్ గ్లోబల్ హెల్త్ సిటీ చెన్నై దేశం నలుమూలలా తిరుగుతూ ఈ వ్యాధిపై అవగాహన పెంచుతూన్నామని అందులో భాగంగా తిరుపతిలోని తమ ఆస్పత్రిలో వైద్యసేవలు ప్రారంభించా రనానరు. ఇకనుంచి నెలలో ప్రతి మూడో బుధవారం, గురువారం ప్రముఖ లివర్ సర్జన్ డాక్టర్ రజనీకాంత్ డిబిఆర్ ఆస్పత్రిలో సమస్యలకు చికిత్స అందిస్తామన్నారు. రాష్ట్రంలో లివర్ సమస్యలతో బాధపడుతున్న రోగులకు ప్రభుత్వం దాదాపు రూ.10లక్షల వరకు సిఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సాయం అందిస్తుందని తెలిపారు.నిరుపేదలు ఎలాంటి అపోహలకు వెళ్ళ కుండా వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో చెన్నై గ్లోబల్ హాస్పిటల్ హెచ్ ఒడి భాస్కర్‌రెడ్డి, మేనేజర్ శరవణగణేష్, వాసురెడ్డి, డిబిఆర్ ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.